గురువారం
05-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 105
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

24 ఏళ్లలో 110 స్టాలిన్ విగ్రహాల ఏర్పాటు

సోవియట్ నేత జోసఫ్ స్టాలిన్‌కు రష్యాకున్న ప్రేమకు సూచికంగా ఆ దేశం నలుమూలల స్టాలిన్ విగ్రహాలు, స్మారకాలు దర్శనమిస్తాయి. 110కుపైగా స్మారకాలు ఆయన సన్మానార్థం ఏర్పాటయ్యాయి.

2లో



చంద్రబాబు బెయిల్‌పై విచారణ

నేటికి వాయిదా

వాడీవేడిగా సాగిన వాదనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్, సీఐడీ కస్టడీ పిటిషన్లపై ఏసీబీ కోర్టులో విచారణ మళ్లీ వాయిదా పడింది. రెండు పక్షాల వాదనలు విన్న ఏసీబీ కోర్టు విచారణను గురువారానికి వాయిదా వేసింది. చంద్రబాబు తరపున సుప్రీం కోర్టు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే వాదనలు వినిపించారు. చంద్రబాబుకు బెయిల్ ఇవ్వొద్దని, కస్టడీకి అనుమతించాలంటూ ప్రభుత్వం తరపున ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదించారు. పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ వాసుదేవ్ విదేశాలకు పరారయ్యారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వాళ్లిద్దరూ ఐటీ దర్యాప్తులో ఉన్నవాళ్లేనా? అని ఏఏజీని కోర్టు ప్రశ్నించింది. స్కిల్ కేసులో చంద్రబాబుతో ఆర్థిక లావాదేవీలు జరపటంతోనే వాళ్లిద్దరూ విదేశాలకు

- మిగతా 2 లో

12 వరకూ లోకేశ్ అరెస్టు వద్దు

2లో

ఢిల్లీకి సీఎం జగన్

- రెండు రోజులు హస్తినలోనే
- కీలక అంశాలపై మోదీ, అమిత్‌షాతో భేటీ
- చంద్రబాబు అరెస్ట్- జనసేన, టీడీపీ పొత్తు , విశాఖకు మకాం మార్పుపై వివరించే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటన ఖరారైంది. గురువారం ఉదయం ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం అక్కడనుంచి సీఎం ఢిల్లీకి ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్తారు. 5వ తేదీ రాత్రి ఢిల్లీలో జన్‌పథ్-1లో ముఖ్యమంత్రి బస చేస్తారు. 6వ తేదీ ఉదయం 9.45 గంటలకు జన్‌పథ్ నివాసం నుంచి విజ్ఞాన్ భవన్‌కు చేరుకుని వామపక్ష తీవ్రవాదంపై అక్కడ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారని అధికారవర్గాలు పేర్కొన్నాయి. ఢిల్లీ పర్యటనలో భాగంగా రెండురోజులు అక్కడే ఉంటున్న ముఖ్యమంత్రి ఈసందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ కానున్నట్లు అధికారపార్టీ వర్గాలు వెల్లడించాయి. టీడీపీ అధినేత చంద్రబాబుని స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ చేసిన తర్వాత తొలిసారిగా సీఎం జగన్ ఢిల్లీ వెళుతున్నారు. అందువల్ల చంద్రబాబు అరెస్ట్‌కు సంబంధించిన కేసు పరిణామాలు, ఆయన రాజమహేంద్రవరంలో జైలులో రిమాండ్‌గా కొనసాగుతున్న సమయంలోనే ఆయనపై ఏసీబీ కోర్టులో ఇన్నర్‌రింగ్‌రోడ్డు కేసులో, ఫైబర్‌గ్రిడ్ కేసులో సీఐడీ అధికారులు దాఖలు చేసిన పీటీ వారెంట్లు, ఆయా స్కామ్‌లలో చంద్రబాబు భాగస్వామ్యాన్ని, ఈ మూడు కేసుల్లోనూ చంద్రబాబు కుమారుడు లోకేశ్ పాత్ర కూడా ఉందని ప్రధానికి, హోంమంత్రికి జగన్ వివరించే అవకాశం ఉందని వైసీపీ నేతలు చెబుతున్నారు. అలాగే

- మిగతా 2 లో

విశాఖ ఉక్కుపై మోదీతో చర్చించండి

జగన్‌కు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం ప్రధానమంత్రితో చర్చించి, దానిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా ఒత్తిడి తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. విశాఖ ఉక్కుకు తగిన వనరులు కేంద్రం నుండి సకాలంలో సరఫరా జరిగేలా చూడాలని సూచించారు. సీఎం జగన్ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో రామకృష్ణ ఈ లేఖ రాశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలు ప్రారంభమైనప్పటి నుంచి అనేక విధాలుగా ఫ్యాక్టరీ అభివృద్ధికి సహాయ నిరాకరణ కొనసాగుతోందని విమర్శించారు. విశాఖపట్నం ఫ్యాక్టరీని నిర్వీర్యం చేయడం ద్వారా ప్రైవేటీకరణకు కేంద్రం కుయుక్తులు పన్నుతోందన్నారు. అందులో భాగంగానే ఐరన్ ఓర్ అడుగంటి పోయిందని, ఏడాదికి 75 లక్షల టన్నుల

- మిగతా 2 లో

పోలీస్ కస్టడీకి న్యూస్‌క్లిక్ ఎడిటర్

- 46 మంది అనుమానితుల విచారణ
- ఢిల్లీ కార్యాలయానికి తాళం
- ఇవి కొత్త ఆరోపణలు కాదు: పురకాయస్థ

న్యూఢిల్లీ: 'న్యూస్‌క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థ, హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిని పోలీసు కస్టడీకి పంపుతూ న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు సీనియర్ అధికారి ఒకరు బుధవారం తెలిపారు. చైనా నుంచి నిధులు పొందుతున్నట్లు ఆరోపణలు రావడంతో వీరిపై ఉగ్రవాద నిరోధక-చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా) కేసు నమోదైంది. పురకాయస్థ, చక్రవర్తిని ఏడు రోజుల పాటు పోలీసు కస్టడీకి పంపుతూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారి వెల్లడించారు. పోలీసులు మంగళవారం న్యూస్‌క్లిక్ ఢిల్లీ కార్యాలయానికి సీల్ వేశారు. 46 మంది అనుమానితులను విచారించారు. వారి నుంచి డిజిటల్ పరికరాలు, లాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లను సీజ్ చేసి పరీక్షలకు పంపారు. 30కుపైగా చోట్ల ఇప్పటికే తనిఖీలు నిర్వహించారు. జర్నలిస్టులు ఊర్మిలేశ్, అనింద్యో చక్రవర్తి, అభిసార్ శర్మ, పరంజయ్ గుహ ఠాకూర్త, ప్రముఖ

- మిగతా 2 లో

న్యాయవ్యవస్థ జోక్యం తప్పదు

సీజేఐ చంద్రచూడ్‌కు జర్నలిస్టు సంఘాల లేఖ

8లో

జల వివాదాల పరిష్కారానికి విధి విధానాలు

- ట్రిబ్యునల్-2కు విజ్ఞప్తి
- తెలంగాణలో పసుపు బోర్డు, గిరిజన వర్సిటీ
- ఉజ్వల లబ్ధిదారులకు వంటగ్యాస్‌పై రూ.300 రాయితీ
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జల వివాదం కొలిక్కిరాబోతోంది. ఇందుకోసం కేంద్ర కేబినెట్ బుధవారం కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఏపీ-తెలంగాణ మధ్య నీటి పంపకాలపై అంతర్రాష్ట్ర నది జలాల వివాదాలు (ఐఎస్‌ఆర్‌డబ్ల్యూడీ) చట్టం,1956 కింద కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 నిబంధనలను ఆమోదించింది. విధివిధానాలు రూపొందించాలని కోరింది. అవిభజిత ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన కేటాయింపుల దృష్ట్యా రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ జరిగేలా చూడాలని సూచించింది. ఈ వివాదం పరిష్కారమైతే రెండు రాష్ట్రాల మధ్య వృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయని కేంద్రకేబినెట్ భావిస్తోంది. అలాగే తెలంగాణలో జాతీయ పసుపు బోర్డు, సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది. ఉజ్వల పథకం కింద పేదలకు ఇచ్చే వంటగ్యాస్ సిలిండర్ ధరపై రాయితీని రూ.300కి పెంచాలని నిర్ణయించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్రకేబినెట్ బుధవారం భేటీ అయి కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతరం విలేకరుల సమావేశంలో కేబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రులు అనురాగ్ ఠాకూర్, కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య జల వివాదాల పరిష్కారానికి విధివిధానాలు రూపొందించాలని, ప్రాజెక్టుల వారీగా నీటిని కేటాయించాలని, మిగులు జలాలనూ రెండో ట్రిబ్యునల్ నిర్ణయిస్తుందని కేంద్రకేబినెట్ నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నిర్ణయం 50లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుస్తుందని కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నిబంధనలు రూపొందించి తమ వాటాను తేల్చాలని తెలంగాణ కోరుతోందన్నారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాల దృష్ట్యా పంపిణీ ఉండాలని చెప్పారు. తెలంగాణలోని ములుగు జిల్లాలో రూ.889 కోట్లతో సమ్మక్క-సారక్క పేరుతో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నిజామాబాద్ పర్యటనలో భాగంగా పసుపు బోర్డు, గిరిజన వర్సిటీ ఏర్పాటు చేస్తామని మోదీ ప్రకటించారు. ఆ మరునాడే కేంద్రకేబినెట్ వీటికి ఆమోదం తెలిపింది. తెలంగాణలో గిరిజనుల ఉన్నత విద్య కోసం సమ్మక్క-సారక్క వర్సిటీని ఏర్పాటు చేసేందుకు కేంద్ర విశ్వవిద్యాలయాల చట్టాన్ని సవరించాలని నిర్ణయించింది. సంబంధిత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు అంగీకారం తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత

- మిగతా 2 లో

మోదీ వ్యాఖ్యలకు

కేసీఆర్ సమాధానం చెప్పాలి

- ఏపీలో శాండ్ బీచ్ రహస్యం ప్రధాని చెప్పాలి
- ఆ ఇద్దరి హస్తం లేకుండా చంద్రబాబు అరెస్టు సాధ్యమా?
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: ఎన్డీయేలో చేరికపై ప్రధాని మోదీ వ్యాఖ్యలకు కేటీఆర్ కాకుండా కేసీఆర్ సమాధానం చెప్పాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. లేదంటే కేసీఆర్‌ను అనుమానించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. కేసీఆర్ ఎన్డీఏలో కలుస్తాననన్న విషయాన్ని మోదీ ఇప్పుడే ఎందుకు చెప్పారు? ఇంతకాలం చెప్పకపోవడానికి మోదీ నోటికి పక్షవాతం వచ్చిందా అని నారాయణ ప్రశ్నించారు. ప్రారంభోత్సవాల పేరిట ప్రభుత్వ ఖర్చుతో వచ్చి మోదీ రాజకీయాలు మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. హడావుడిగా పాత అభివృద్ధి పనులను మోదీ ప్రారంభిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ మగ్దూం భవన్‌లో సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, పశ్య పద్మతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడారు. మోదీ ఇంత దిగజారి మాట్లాడతారనుకోలేదన్నారు. బీజేపీ అంతిమ దశలో ఉందన్నారు.మోదీ పసుపు బోర్డు ఏర్పాటుపై చేసిన ప్రకటన... చనిపోయే ముందు తులసి తీర్థం పోసినట్లు ఉందన్నారు. మోదీ చెప్పాల్సిన అసలు రహస్యం ఏపీలో విలువైన ఇసుక బీచ్ అదానీకి అప్పగించడం గురించి అని నారాయణ అన్నారు. అదానీ, ఏపీ సీఎం జగన్ మధ్య రహస్య ఒప్పందం జరిగిందని విమర్శించారు. అదానీ సీఎం జగన్‌ను ఎందుకు కలిశారనే విషయం చెప్పాలన్నారు. లిక్కర్ స్కాంలో మనిష్ సిసోడియాను మాత్రమే ఎందుకు అరెస్ట్ చేశారని నారాయణ ప్రశ్నించారు. కోట్లు తిన్న వాళ్లు బయట ఉన్నారని... రూ.వందల కోట్ల అవినీతి పేరుతో చంద్రబాబును జైల్లో పెట్టారని నారాయణ అన్నారు. ఆయన్ను అక్రమ పద్ధతితో అరెస్ట్ చేశారని, అది సరికాదన్నారు. ఆయనేం దేశం వదిలి పారిపోయే వ్యక్తికాదన్నారు. మోదీ, అమిత్ హస్తం లేనిదే చంద్రబాబును అరెస్ట్ చేస్తారా? అని నారాయణ

- మిగతా 2 లో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు

ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్

అరెస్ట్

సింగ్ నివాసంలో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ను ఈడీ బుధవారం అరెస్టు చేసింది. మద్యం కుంభకోణం కేసు దర్యాప్తుతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో ఆయన నివాసంలో బుధవారం ఉదయం నుంచి ఆయన ఇంట్లో కొన్ని గంటలపాటు సోదాలు జరిపిన ఈడీ అధికారులు సంజయ్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

శాంతికోసం ఇన్ని బూతులు మాట్లాడుతున్నారే మన వాళ్లలో ఒకరిని వచ్చే ఏడాది సిఫార్సు చేయమని పెద్దసారుకి చెప్పాలి!

ప్రతీకార చర్యలు సరికాదు

ఈడీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: అరెస్టులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి సుప్రీంకోర్టు బుధవారం మొట్టికాయలేసింది. కేసుల దర్యాప్తు సమయంలో కక్షసాధింపు చర్యలకు పాల్పడకూడదని, చట్ట ప్రకారం వ్యవహరించాలని ఈడీని హెచ్చరించింది. మనీలాండరింగ్ కేసులో గురుగ్రామ్ కంపెనీకి చెందిన రియల్టీ గ్రూప్ ఎం3ఎం డైరెక్టర్లు బసంత్ బన్సాల్, పంకజ్ బన్సాల్ అరెస్టులను కొట్టివేస్తూ ఈడీపై మండిపడింది. ఈ తీర్పు బుధవారం నోట్ చేసింది. తమ అరెస్టులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లను పంజాబ్, హరియానా హైకోర్టు కొట్టివేయడంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జూన్ 14న బన్సాల్‌లను విచారణకు రావాల్సిందిగా సమన్లు జారీ చేశారని, అదే రోజు ఈడీ నమోదు చేసిన మరో కేసులో అరెస్ట చేశారని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈడీ ప్రతి చర్య పారదర్శకంగా, ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొంది. కానీ, ఈ కేసులో దర్యాప్తు సంస్థ తన అధికారాలను, విధులను అనుసరించడంలో విఫలమైనట్లు వాస్తవాలు నిరూపించాయని పేర్కొంది. ప్రశ్నలకు నిందితులు సమాధానం చెప్పనంత మాత్రాన అరెస్టు చేయడం సరికాదని హెచ్చరించింది. మనీలాండరింగ్ చట్టం కింద

- మిగతా 2 లో

ఒప్పందాలు కార్యరూపం

- పరిశ్రమలు, ఆహారశుద్ధి రంగంలో 13 ప్రాజెక్టులు
- రూ.3 వేల కోట్ల పెట్టుబడులు, 7వేల మందికి ఉద్యోగావకాశాలు
- వర్చువల్‌గా సీఎం జగన్ శంకుస్థాపన

8లో

పరిశ్రమలు, ఆహారశుద్ధి రంగంలో మొత్తం 13 ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. వీటిలో పూర్తయిన మూడు కంపెనీలను ప్రారంభించగా, 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఒక ప్రాజెక్టుకు అవగాహన ఒప్పందం చేసుకున్నారు.

జగన్ ప్రభుత్వంలో

రాజధాని లేని ఏపీ

జనసేన అధినేత పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర-పెడన : ఆంధ్ర ప్రదేశ‌ను భ్రష్టు పట్టించి రాజధాని లేని రాష్ట్రంగా జగన్ ప్రభుత్వం చేసిందని, వైసీపీని తరిమి కొట్టే వరకు జనసేన నిద్రపోదని ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. బుధవారం వారాహి యాత్ర స్థానిక తోట మూల సెంటర్‌లో

- మిగతా 2 లో

మళ్లీ స్పీకర్‌గా పోటీ చేయను

పదవి నుంచి తొలగింపు తర్వాత మెక్‌కార్తీ

వాషింగ్టన్: అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌గా కెవిన్ మెక్‌కార్తీపై వేటు పడింది. దీనిపై ఆయన స్పందిస్తూ మరోమారు ఈ పదవి కోసం పోటీ చేయబోనని ప్రకటించారు. వేరొకరి ఎంపికకు మద్దతిస్తాను. జరిగినదాంట్లో ఏది మార్చాలని అనుకోను అని ఆయన తెలిపారు. తనను పదవి నుంచి తొలగించేందుకు డెమొక్రాట్లతో కలిసి ఓటేసిన ఎనిమిది మంది రిపబ్లికన్ల చిన్న విజన్‌ల కంటే దేశంలో ఎంతో గొప్పదని చెప్పారు. కాంగ్రెస్‌లో కొనసాగాలా వద్దా అన్నది త్వరలోనే నిర్ణయిస్తానని మెక్‌కార్తీ అన్నారు. కాగా, దేశ 234ఏళ్ల చరిత్రలో మొదటిసారి ఓ స్పీకర్‌పై బహిష్కరణ వేటు పడింది. స్పీకర్ తొలగింపునకు సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. 216-210 లెక్కన ఓట్లు వచ్చాయి. ఈ పరిణామం మంగళవారం చోటుచేసుకుంది. డెమొక్రాట్లకు సహకరించినందుకు కెవిన్ మెక్‌కార్తీపై రిపబ్లికన్లు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. 2024 అధ్యక్ష ఎన్నికల క్రమంలో రిపబ్లికన్లలో అంతర్గత పోరు ఈ రూపేణ బహిర్గతమైంది. మెక్‌కార్తీకి అండగా నిలవకుండా ఎనిమిది మంది రెబల్ రిపబ్లికన్లకు డెమొక్రాట్లు మద్దతివ్వడంతో స్పీకర్ తొలగింపునకు ప్రతినిధుల సభ తీర్మానించగలిగింది.

అమెరికా చరిత్రలోనే అతిపెద్ద ఆందోళన

- 75వేల మంది ఆరోగ్య కార్మికుల మూడురోజుల సమ్మె
- 'కైసర్ పర్మనెంటే' విధానాలకు వ్యతిరేక నిరసనలు
- మెరుగైన వేతనాలు, ఉద్యోగ పరిస్థితుల కోసం డిమాండ్

లాస్‌ఏంజిల్స్: అమెరికా చరిత్రలోనే అతిపెద్ద సమ్మెకు ఆరోగ్య సంరక్షణ రంగ కార్మికులు మూడు రోజుల సమ్మెను ప్రారంభించారు. ఆసుపత్రుల్లో, ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత నివారణ, ఉద్యోగ భద్రత, సముచిత జీతాల కోసం చర్చలు ఫలించకపోవడంతో సమ్మెబాట పట్టక తప్పలేదని కార్మికుల ప్రతినిధులు వెల్లడించారు. కైసర్ పర్మనెంటే సిబ్బంది విధానాలకు వ్యతిరేకంగా సిబ్బంది విధులను బహిష్కరించారు. 75వేల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఉద్యోగ భద్రత, సిబ్బంది నియామకాల కోసం డిమాండ్ చేశారు. ఆరోగ్య రంగ కార్మికుల సంఘాలన్నీ మద్దతిచ్చాయి. కాలిఫోర్నియా, కొలరాండో, ఒరేగాన్, వాషింగ్టన్, వర్జీనియా, వాషింగ్టన్ డీసీ వంటి ప్రధాన నగరాల్లోని జీవ వ్యయం పెరిగి చాలీచాలని జీతాలకు తోడు అధిక పనిఒత్తిడితో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్లు నిరసనకారులు వెల్లడించారు. మెరుగైన పరిస్థితుల కల్పన కోసం జరుపుతున్న చర్చలు సత్ఫలితాలివ్వడం లేదని, రాజీ ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రతినిధులు అన్నారు. కైజర్ సంస్థ ప్రవేశపెట్టాలనుకున్న ట్యూటైర్ వేతన వ్యవస్థను కార్మికులు వ్యతిరేకించారు. సర్వీస్ ఎంప్లాయీస్ ఇంటర్నేషనల్ యూనియన్ (ఎస్ఈఐయూ), యునైటెడ్ హెల్త్‌కేర్ వర్కర్స్ వెస్ట్ (యూహెచ్‌డబ్ల్యూ)కు చెందిన 57,443 మందితో పాటు ఆఫీస్, ప్రొఫెషనల్ ఎంప్లాయీస్ ఇంటర్నేషనల్ యూనియన్ (ఓపీఈఐయూ) లోకల్ 30, సెస్ఈఐయూ లోకల్ 49, ఓపీఈఐయూ లోకల్ 2 తదితర కార్మిక సంఘాల వారు ఈ సమ్మెలో పాల్గొన్నారు. అమెరికా ఆరోగ్య రంగంలో ఇంత పెద్ద సమ్మె జరగడం ఇదే మొదటిసారిగా ప్రతినిధులు తెలిపారు. 'ఆరోగ్యరంగ సిబ్బంది సంకీర్ణంలో ఉన్నా వేతన ప్రతిపాదనపై చర్చించాలని కూడా కైజర్ అనుకోవడంలేదు. 25ఏళ్ల భాగస్వామ్యంలో ఇలా ఎన్నడూ జరగలేదు' అని ఎస్ఈఐయూ-యూహెచ్‌డబ్ల్యూ ప్రకటన పేర్కొంది. కోవిడ్-19 కాలం నుంచి ఆరోగ్య రంగంలో వలసలు కొనసాగుతున్నట్లు తెలిపింది. సిబ్బంది భద్రత విషయాన్ని కైజర్ పర్మనంటె పట్టించుకోలేదని ఆరోపించింది. అవసరమైన వేతన సవరణలకూ ఒప్పుకోవడంలేదని ఎస్ఈఐయూ-యూహెచ్‌డబ్ల్యూ వెల్లడించింది. అయితే ప్రస్తుతం చర్చలు త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశమున్నట్లు సమాచారం.

24ఏళ్లలో 110 స్టాలిన్ విగ్రహాల ఏర్పాటు

మాస్కో: సోవియట్ నేత జోసఫ్ స్టాలిన్‌కు రష్యాకున్న ప్రేమకు సూచికంగా ఆ దేశం నలుమూలల స్టాలిన్ విగ్రహాలు, స్మారకాలు దర్శనమిస్తాయి. 110కుపైగా స్మారకాలు ఆయన సన్మానార్థం ఏర్పాటయ్యాయి. 22 నిలువెత్తు విగ్రహాలు సహా 95 స్మారకాలు గత 24 ఏళ్లలో దేశంలో ఏర్పాటైనట్లు 'మోజెమ్ ఓబియాస్నిట్' వెల్లడించింది. సోవియట్ రాజకీయ అణచివేత బాధితుల కోసం ట్వర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్మారకం వద్ద స్టాలిన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు రష్యా మీడియా తెలిపింది. విప్లవవీరులు వ్లాదిమిర్ లెనిన్, ఫెలిక్స్ డెజర్‌జిన్స్కీ, పొలిట్ బ్యూరో సభ్యులు మైఖెల్ కాలినిన్ విగ్రహాలూ అనేక చోట్ల ఏర్పాటైనట్లు తెలిపింది. 'గ్రేట్ పేట్రియాటిక్ వార్' నాయకుడికి అంకితమిచ్చిన స్మారకాలు 1990 దశకంలో కేవలం ఐదు ఉండేవని, ప్రస్తుతం అవి 110కుపైగా ఉన్నాయని 'మోజెమ్ ఓబియాస్నిట్' వెల్లడించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నాయకత్వంలో స్టాలిన్ స్మారకాల సంఖ్య పెరిగినట్లు తెలిపింది. పుతిన్ 1999లో అధికారంలోకి వచ్చారు. స్టాలిన్‌తో పాటు సోవియన్ యూనియన్ వీరుల స్మారకాలు పెరగడం కచ్చితంగా సానుకూల పరిణామన్న అభిప్రాయం విశ్లేషకుల్లో ఉంది.

12 వరకూ లోకేశ్ అరెస్టు వద్దు

సీఐడీకి హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. విచారణను ఈ నెల 12కు న్యాయస్థానం వాయిదా వేసింది. అప్పటివరకూ లోకేశ్‌ను అరెస్టు చేయవద్దని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. స్కిల్ కేసులో లోకేశ్ పేరు చేర్చలేదని గత విచారణలో హైకోర్టుకు సీఐడీ తెలిపింది. అయితే సీఐడీ దాఖలు చేసిన చంద్రబాబు రిమాండ్ రిపోర్ట్‌లో చంద్రబాబు కుటుంబ సభ్యులు లబ్ధి పొందినట్లు పేర్కొన్నారని లోకేశ్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో పిటిషనర్‌ను అరెస్టు చేస్తారని ముందస్తు బెయిల్ దాఖలు చేసినట్లు తెలిపారు. దీనిపై తనకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేవని సీఐడీ తరపున అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ సుబ్రహ్మణ్యం కోర్టుకు తెలిపారు. ఈ కేసు విచారణను వచ్చే బుధవారానికి వాయిదా వేయాలని అడ్వకేట్ జనరల్ కోరారు. దీంతో అప్పటి వరకూ లోకేశ్‌కు ముందస్తు బెయిల్ పొడిగిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఎన్నికల తాయిలమే... కాంగ్రెస్

న్యూఢిల్లీ: ఉజ్వల లబ్ధిదారులకు సరఫరా చేసే వంట గ్యాస్ సిలిండర్ ధరపై రాయితీని రూ.300కు పెంచడం పేదలకు బీజేపీ ఎన్నికల తాయిలమని కాంగ్రెస్ విమర్శించింది. త్వరలోనే కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ రూపేణ ప్రజల మెప్పును పొందాలని సర్కార్ భావిస్తోందని దుయ్యబట్టింది. కాంగ్రెస్ నేత అజయ్ కుమార్ బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'ఇదంతా ఎన్నికల కోసమే. అవి ముగిసిన తర్వాత ధరలు పెంచేస్తారు. నా మాటలను ప్రజలు గుర్తుపెట్టుకోవాలి' అని అన్నారు. 'మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికలు డిసెంబరులో ముగుస్తాయి. ఆ తర్వాత వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.300 మేర బీజేపీ ప్రభుత్వం పెంచుతుంది. మరలా లోక్‌సభ ఎన్నికల ముందు రూ.300 తగ్గిస్తుంది.

ఎన్నికలప్పుడు ఇలా ధరలు తగ్గించడం ప్రభుత్వానికి అలవాటు. తద్వార లబ్ధి పొందాలని ఆకాంక్ష. కానీ ఈసారి వారి వ్యూహం బెడిసికొట్టడం తథ్యం' అని కుమార్ వ్యాఖ్యానించారు.

ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

కేసులో అప్రూవర్‌గా మారిన వ్యాపారవేత్త దినేశ్ అరోడాతో సంజయ్‌కు పరిచయాలు ఉన్నట్లు ఈడీ అధికారులు చెబుతున్నారు. ఎంపీ నివాసంలో సోదాల తర్వాత సంజయ్ సింగ్‌ను ఈడీ కార్యాలయానికి తీసుకెళ్లి ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. గురువారం మధ్యాహ్నం ఆయన్ను కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఆప్ నుంచి అరెస్టయిన కీలక నేతల్లో సంజయ్ సింగ్ మూడో నేత కావడం గమనార్హం. గతంలో నాలుగు కంపెనీల ద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలపై దిల్లీ ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేసిన సత్యేందర్ జైన్‌ను ఈడీ అరెస్టు చేయగా.. ఆ తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో కేజ్రీవాల్ సన్నిహితుడు, అప్పటి దిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియాను మద్యం కుంభకోణం కేసులో సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

బీజేపీకి ఓటమి భయం... అందుకే బరితెగింపు చర్యలు: కేజ్రీవాల్

సంజయ్‌సింగ్ ఇంట్లో ఈడీ సోదాలపై దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 2024లో ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన బీజేపీ... బరితెగింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. దేశంలో ఎప్పుడు, ఎక్కడ ఎన్నికలు దగ్గరపడినా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) క్రియాశీలం అవుతాయని చెప్పారు. సంజయ్ సింగ్ నివాసంలో నిర్వహిస్తున్న సోదాల్లో ఈడీకి ఏమీ దొరకవని కేజ్రీవాల్ పేర్కొన్నారు. కొన్ని నెలల్లో 2024 లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయని, ఆ ఎన్నికల్లో ఓటమి తప్పదనే విషయం బీజేపీకి అర్థమైందని, అందుకే ఓటమిని తప్పించుకునేందుకు బీజేపీ సర్కారు విపక్షాలపై బురదజల్లుతోందని ఆయన ఆరోపించారు. విపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టి అవినీతిపరులుగా ముద్ర వేయడం బీజేపీకి అలవాటుగా మారిందని విమర్శించారు.

అందుకే ఎన్నికలు వచ్చినప్పుడల్లా విపక్ష నేతలపై విచారణ కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ యాక్టివ్ అవుతాయని కేజ్రీవాల్ ఎద్దేవా చేశారు. సంజయ్‌సింగ్ నివాసంలో ఈడీ సోదాలను ఆప్ జాతీయ ప్రతినిధి రీనా గుప్తా ఖండించారు. "ప్రధాని నరేంద్రమోదీ-వ్యాపారవేత్త అదానీ..విషయంపై సంజయ్ సింగ్ తరచూ ప్రశ్నిస్తున్నందుకే ఆయన్ను లక్ష్యం గా చేసుకొని...నివాసంపై ఈడీ సోదాలు జరుపుతోంది. ఇప్పటికీ ఇంట్లో ఏమీ దొరకలేదు. రోజంతా వెతికినా ఏమీ కనిపెట్టలేరు. నిన్న (మంగళవారం) కొంతమంది జర్నలిస్టుల ఇళ్లలో కూడా ఈడీ సోదాలు జరిపింది" అని ఆమె ధ్వజమెత్తారు. మరోవైపు, ఎంపీ నివాసంలో సోదా జరుగుతున్న తరుణంలో సంజయ్ సింగ్ తండ్రి మీడియాతో మాట్లాడారు. 'ఈడీ అధికారులు ఉదయం సుమారు 7.30 ప్రాంతంలో వచ్చారు. అధికారులు వారి పని వారు చేస్తున్నారు. వారు రాగానే చెప్పాను అర్ధరాత్రి దాకా అయినా సోదాలు చేసుకోవచ్చని చెప్పా. మేము పూర్తిగా వారితో సహకరిస్తున్నాం. వారు మళ్లీ మళ్లీ మా ఇంటికి రావడం మాకు ఇష్టం లేదు. ఈ కేసులో క్లీన్‌చిట్ వచ్చేంతవరకూ ఎదురు చూస్తాం' అని ఎంపీ తండ్రి పేర్కొన్నారు. ఇక సంజయ్ సింగ్ నివాసంపై దాడులు బాధకరమన్నారు ఆర్జేడీ ఎంపీ మనోజా. 'ఇది బాధాకరం. కానీ ఆశ్చర్య మేమీ కాదు. ఈ దాడుల ఎపిసోడ్స్ 2024 ఎన్నికల వరకు కొనసాగుతాయి. రీసెంట్‌గా మోదీ, అమిత్ షా ఎన్నికల ప్రకటన కూడా చేశారు. నిన్న న్యూస్‌క్లిక్ జర్నలిస్ట్‌ల పై రైడ్ చేశారు. ఈరోజు సంజయ్‌పై చేశారు' అని అన్నారు.

కేసీఆర్ సమాధానం చెప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. కేంద్రంలో మోదీ, ఏపీలో జగన్ ప్రతిపక్ష నేతలను మానసికంగా ఇబ్బందులు పెట్టేలా వారిపై కేసులు పెడుతున్నారన్నారు. చంద్రబాబును దెబ్బకొడితే బీజేపీ బలపడుతుందనేది మోదీ ప్లాన్ అన్నారు. ఎన్నో కేసులు ఉన్న జగన్‌ను పక్కన పెట్టేయడం ఆయనకు పెద్ద పనేం కాదన్నారు. జగన్ ఈ విషయం అర్థంకాక ఎగిరెగిరి పడుతున్నారని నారాయణ విమర్శించారు. కక్షపూరితంగా కేసులు పెట్టడం సరికాదన్నారు. భవిష్యత్‌లో కేసీఆర్‌కు చంద్రబాబు గతే పడుతుందన్నారు.

మోదీ మళ్లీ వస్తే దేశం రెండుగా విడిపోతుంది

దేశంలో నిజమైన కూటమి అంటే బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం అని నారాయణ అన్నారు. మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే దేశం ఉత్తర భారత్, దక్షిణ భారత్ గా విడిపోయే ప్రమాదం ఉందన్నారు. దక్షిణాది రాష్ట్రాలను మోదీ రెచ్చగొడుతున్నారని.. అలాంటి పరిస్థితులు రానియకుండా దేశాన్ని కాపాడాలన్నారు. రోజు రోజుకు ఇండియా కూటమి బలపడుతుండటంతో మోదీకి భయం పట్టుకుందన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు చీల్చేందుకు బీఆర్ఎస్, ఎంఐఎం మూడవ ప్రత్యామ్నాయం పేరిట కూటమి అంటున్నారని విమర్శించారు.

న్యూస్ క్లిక్ దాడి ప్రజాస్వామ్య హననమే

న్యూస్ క్లిక్‌పై దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని నారాయణ తీవ్ర స్థాయిలో విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రసారం చేసిన, ప్రచురించిన ఛానళ్లు, పత్రికలపై కేంద్ర ప్రభుత్వం తన పరిధిలోని సంస్థలతో దాడులు చేయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యూస్ క్లిక్ సంపాదకులు, రిపోర్టర్ల ల్యాప్‌టాప్‌లు లాక్కోవడం, వారిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు.

ఇది స్వేచ్ఛపై జరుగుతున్న దాడి అన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నివాసంపై దాడి చేశారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికా స్వేచ్ఛను మోదీ సర్కార్ హరిస్తోందని విమర్శించారు.

రక్షణ దళాలకు సాంకేతిక శిక్షణ ఇవ్వాలి: అజీజ్ పాషా

అగ్నిపథ్ శిక్షణ పొందిన రక్షణ దళాలకు సాంకేతిక పరమైన శిక్షణ ఇప్పించాలని సయ్యద్ అజీజ్ పాషా కేంద్రాన్ని డిమాండ్ చేశారు. నామమాత్రపు శిక్షణతోనే సరిపెట్టవద్దన్నారు. నూతనంగా వస్తున్న ఆధునిక సాంకేతిక అంశాలలో కూడా వారికి శిక్షణ ఇవ్వడం అవసరమన్నారు. ఆసియా క్రీడల్లో దేశానికి 18 బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను సముచితంగా సత్కరించాలన్నారు. క్రీడల్లో మరింత మెరుగైన ప్రతిభ కనబర్చేందుకు ప్రొత్సహించాలని సూచించారు.

చంద్రయాన్ -3 విజయవంతం కావడానికి కృషి చేసిన శాస్త్రజ్ఞులకు సర్కార్ వేతనాలు ఇవ్వడం లేదన్నారు. జి-20 పేరిట మోదీ ప్రభుత్వం డబ్బులు దుబారా చేసిందని విమర్శించారు. జి-20 పేరిట దిల్లీలో పేదల గుడిసెలను తొలగించడం బాధాకరమన్నారు. దేశ జీడీపీ పెరిగిందని కేంద్రం గొప్పగా చెబుతోందని... ఇందులో వాస్తవం లేదన్నారు. కేవలం ప్రచార ఆర్భాటం మాత్రమే అన్నారు.

దిల్లీకి సీఎం జగన్

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు అరెస్ట్ తర్వాత రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ అధినేత చంద్రబాబుతో ములాఖత్ అనంతరం వచ్చే ఎన్నికల్లో టీడీపీతో పొత్తు ఉంటుందని ప్రకటించిన పరిస్థితులను మోదీ దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఇక ఈనెల 24వ తేదీ విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం విశాఖపట్నం తరలించే అంశాన్ని ప్రధానికి తెలియజేయనున్నారు. అవసరమైతే దీని ప్రారంభానికి ఆహ్వానించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం మూడు రాజధానుల వ్యవహారం సుప్రీంకోర్టులో ఉన్నందున పరిపాలనా రాజధానిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విశాఖపట్నంకు సీఎం క్యాంపు కార్యాలయం తరలిస్తున్నామని, దానివల్ల న్యాయపరంగా ఎటువంటి ఇబ్బందులుండవని అమిత్‌షాకు సీఎం నచ్చజెప్పనున్నారు. ఈ మూడు కీలక అంశాలను ప్రధాని దృష్టికి తీసుకురావడంతో పాటు, పోలవరం ప్రాజెక్టు పునరావాస ప్యాకేజీ, ఎఫ్ఆర్‌బీఎం పరిమితి పెంపు, తెలంగాణ రాష్ట్రం నుంచి రావల్సిన బకాయిలు, విభజన అంశాల్లో అత్యవసరంగా రాష్ట్రానికి మేలు చేకూర్చేవాటిని వారి దృష్టికి తీసుకొచ్చే అవకాశం ఉంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర జలశక్తి మంత్రితో కూడా సీఎం భేటీ అయ్యే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

విధి విధానాలు

(మొదటిపేజీ తరువాయి)

విద్య ప్రమాణాలను పెంచేందుకు కొత్త వర్సిటీ దోహదమవుతుందని అధికారిక ప్రకటన పేర్కొంది. 'కేంద్ర వర్సిటీల (సవరణ) బిల్లు, 2023ని పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు కేంద్రకేబినెట్ నిర్ణయించింది. కేంద్ర వర్సిటీల చట్టం, 2009కు సవరణలు చేసి తెలంగాణ, ములుగు జిల్లాలో సమ్మక్క సారక్క కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిశ్చయించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, 2014లోని 13వ షెడ్యూల్ ప్రకారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటన వెల్లడించింది. కాగా, ఉజ్వల పథకం కింద పేదలకు సరఫరా చేసే వంట గ్యాస్ సిలిండర్ ధరపై ఇచ్చే రాయితీని పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందని అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. రాయితీని రూ.200 నుంచి రూ.300కు పెంచినట్లు చెప్పారు. ప్రస్తుతం 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్ మార్కెట్ ధర రూ.903 కాగా ఉజ్వల లబ్ధిదారులు రూ.703 చెల్లిస్తున్నారని, ఇకపై రూ.603కే వారు సిలిండర్ పొందవచ్చని ఠాకూర్ తెలిపారు. మరోవైపు కేంద్ర పాలిత ప్రాంతాల అద్దె చట్టాలకూ కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. అండమాన్, నికోబార్, దాదర్-నాగర్ హవేలి, దామన్, దయ్యూ వంటి కేంద్ర పాలిత ప్రాంతాలలో అద్దె ప్రాంతాలకు సంబంధించి న్యాయబద్ధ కార్యాచరణ కోసం జవాబుదారీతనం, పారదర్శకతతో కూడిన ఎకో-వ్యవస్థను రూపొందించేలా నిర్ణయించింది. ఇందుకోసం అండమాన్, నికోబార్ దీవుల అద్దె చట్టం,2023; దాదర్-నాగర్ హవేలీ & దామన్ దయ్యూ అద్దెచట్టం,2023; లక్షద్వీప్ అద్దెచట్టం 2023కు ఆమోదం తెలిపింది. కాగా, రాజ్యాంగంలోని అధికరణ 240 కింద కేంద్ర పాలిత ప్రాంతాల్లో చట్టాలను చేసే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది.

జగన్ ప్రభుత్వంలో రాజధాని లేని ఏపీ

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. తొలుత ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ బహిరంగ సభలో పవన్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తే, కూలీల పొట్ట కొట్టి జగన్‌మోహన్ రెడ్డి వేల కోట్లను దారి మళ్లించారని ఆరోపించారు. పెడనకు ప్రసిద్ధిగాంచిన చేనేత రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని, కార్మికులకు అందాల్సిన పథకాలన్నీ తుంగలో తొక్కి ఒక్క నేతన్న నేస్తం ఇవ్వడం వల్ల వారికి ఉపాధి కరువై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కలంకారీ ప్రసిద్ధి అయిన కలంకారీ కార్మికులకు పూర్తిగా ఉపాధి కరువైందని ప్రశ్నించారు. లక్షల ఉద్యోగాలు ఇస్తానని అధికారంలోకి వచ్చి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను జగన్‌మోహన్ రెడ్డి మోసం చేశాడని తెలిపారు. జగన్‌ను గద్దె దించేందుకే జనసేన-టీడీపీ కలిశాయని అన్నారు. ఉద్యోగులు కూడా జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. ఈ నియోజకవర్గంలో చూస్తే స్థానిక ప్రజాప్రతినిధి అవినీతి ఏ మేరకు ఉందో తనకు అర్థమవుతుందని చెబుతూ ఆ ప్రతినిధిని ఎండగట్టారు. కృత్తివెన్ను మండలంలో సర్వే నంబర్ 94లో గల మడ అడవులను నరికి వందల ఎకరాల చేపల చెరువులుగా మార్చి అమ్మేసుకున్నాడని తెలిపారు. ప్రతి పనికి ఒక సపరేటు రేటు ఫిక్స్ చేసి నియోజకవర్గాన్ని దోచుకున్నాడని అన్నారు. పేదలకు జగనన్న పేరిట లక్షల ఇళ్లు ఇస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్నారే తప్ప కనీసం ఒక గృహ ప్రవేశం చేయించారా అని ప్రశ్నించారు. జగనన్న ఇళ్లల్లోకి మట్టితో మెరక తోలించుకోవాలంటే ఆ మట్టి పేరుతో కోట్ల రూపాయలు స్థానిక ప్రజా ప్రతినిధి దోచుకోలేదా, అది మీ అందరికీ తెలియదా అని ప్రశ్నించారు. చేనేత కార్మికులకు నేతన్న నేస్తం అనే పథకం ఇవ్వడం వల్ల వారికి నష్టం జరుగుతుందే తప్ప లాభం ఏమీ లేదని అన్నారు ఒకవేళ లాభం ఉంటే కార్మికులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు తెలపాలని ప్రభుత్వాన్ని కోరారు. 2024లో జరగబోయే ఎన్నికలలో ఆంధ్ర ప్రదేశ్ భవిష్యత్తు కోసమే టీడీపీతో పొత్తు పెట్టుకున్నామని తెలుపుతూ జగనన్న ప్రభుత్వాన్ని అధః పాతాళానికి తొక్కేస్తామన్నారు.

పవన్ కల్యాణ్‌కు పోలీసుల నోటీసు

విశాలాంధ్ర-మచిలీపట్నం : వారాహి యాత్రపై రాళ్ల దాడికి ప్లాన్ చేశారంటూ పవన్ కల్యాణ్ ఆరోపించడాన్ని జిల్లా ఎస్పీ జాషువా తప్పు పట్టారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై జిల్లా ఎస్పీ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆరోపణలకు సాక్ష్యాలు ఏవైనా ఉన్నాయా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. పవన్ చేసిన ఆరోపణలకు పెడన ఎస్సై నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. పవన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం చాలా దారుణమని, అందుకే ఆయనకు నోటీసులు ఇచ్చామన్నారు. దాడులు జరుగుతాయనే సమాచారం మీకు ఎక్కడి నుంచి వచ్చిందనేది మాకు తెలియపర్చమని కోరడం జరిగిందన్నారు. తాము పంపిన నోటీసులకు పవన్ నుంచి ఎలాంటి సమాధానం రాలేదని, అంటే ఆయన నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అనుకోవాలా?, ఎటువంటి సమాచారంతో పవన్ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని జిల్లా ఎస్పీ ప్రశ్నించారు. సరైన ఆధారాల్లేకుండా వ్యాఖ్యలు, ఆరోపణలు చేయడం తప్పని ఆయన సూచించారు. బాధ్యతారాహిత్యంగా ఆరోపణలు చేస్తే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని, రెచ్చగొట్టే భాష, సైగలు మానుకొని పవన్ కళ్యాణ్ మాట్లాడాలని, మా సమాచార వ్యవస్థ మాకు ఉంటుందని, పవన్ కంటే నిఘా వ్యవస్థ మాకు బలంగా ఉందని స్పష్టం చేశారు.

పోలీస్ కస్టడీకి న్యూస్‌క్లిక్ ఎడిటర్

(మొదటిపేజీ తరువాయి)



చరిత్రకారులు సోహెల్ హాష్మి, వ్యంగ్యకారుడు సంజయ్ రజౌరా, డి.రఘునందన్ (టెక్నాలజీ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్)ను సుమారు ఆరు గంటలకుపైగా విచారించిన అనంతరం పోలీసులు విడిచిపెట్టారు. ఉపా చట్టం కింద ఓ మీడియా సంస్థపై కేసు నమోదు కావడం ఇదే తొలిసారని కేంద్ర హోంశాఖకు నివేదించే దిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. న్యూస్‌క్లిక్‌పై 2021లో ఈడీ, ఐటీ దాడులు జరిగాయి. న్యూస్‌క్లిక్‌పై ఉపాతో పాటు ఐపీసీలోని 153ఏ (రెండు వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం), 120బీ (క్రిమినల్ కుట్ర) కింద ఆగస్టులో కేసు నమోదైనట్లు పోలీసు అధికారి తెలిపారు. న్యూస్‌క్లిక్‌కు చైనా నుంచి నిధులు అందుతున్నాయని న్యూయార్క్ టైమ్స్ ఆగస్టులో నివేదించింది. తాజా పరిణామాలపై పుర్కాయస్థ స్పందిస్తూ 'ఇవేవీ కొత్తగా చేసిన ఆరోపణలు కాదు. గతంలోనూ వీటిని ఎదుర్కొన్నాం. తగిన విధంగా ముందుకెళతాం' అని అన్నారు. న్యూస్‌క్లిక్, జర్నలిస్టులపై చర్యలపై ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా నిరసన వ్యక్తంచేసింది. అనేక జర్నలిస్టు సంఘాలు కూడా ఖండించాయి. దీనిపై భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. మీడియాపై ఉక్కుపాదం మోపేందుకు జరిగిన మరో చర్యగా న్యూస్‌క్లిక్‌పై చర్యలను ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా వర్ణించింది. 'ఆరోపణలు నిజమని నిరూపితమైతే చట్టప్రకారం ముందుకెళ్లాలి తప్ప రాక్షస చట్టాలను అడ్డుపెట్టుకొని ప్రత్యేకించి కొన్ని నేరాలపై విచారణ నెపంతో భయోత్పాద వాతావరణాన్ని సృష్టించరాదు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించరాదు. నిరసన గళాలను అణచివేయరాదు' అని ఎడిటర్స్ గిల్డ్ పేర్కొంది.

విశాఖ ఉక్కుపై మోదీతో చర్చించండి

(మొదటిపేజీ తరువాయి)

సామర్థ్యం కలిగిన ప్రాంతంలో కేవలం 50 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి జరుగుతుందన్నారు. సంస్థ ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలో అలసత్వం నెలకొందన్నారు. ఉద్యోగుల జీతాల చెల్లింపులు కోసం నెలకు రూ.80 కోట్లు అవసరం కాగా ప్రస్తుతం సంస్థలో నగదు నిల్వలు రూ.10 కోట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ముడి పదార్థాలు లేకపోవడంతో ప్లాంట్‌లోని ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌ని దాదాపు ఏడాదిన్నర క్రితం మూసివేశారని పేర్కొన్నారు. ఐరన్ ఓర్ నిల్వలు నిండుకోవటంతో రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా మూసినట్లు తెలుస్తోందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి రెండు నెలల క్రితం వరకు ఎన్ఎండీసీ ఐరన్ ఓర్‌ను అవసరమైనంత ఇవ్వలేదని వివరించారు. ప్రస్తుతం రైల్వే లైన్ ఇబ్బందుల కారణంగా ఐరన్ ఓర్‌ను ఎన్ఎండీసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ద్వారా సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఇందుకు చొరవ చూపాల్సిన కేంద్రంలోని స్టీల్ మంత్రిత్వ శాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దీనినిబట్టి బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అభివృద్ధి చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నట్లు చెప్పిన మాటలు అసత్యాలని తేటతెల్లమవుతున్నాయని విమర్శించారు. ఇవన్నీ గమనిస్తే కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తోందని, ఉద్యోగులకు పొమ్మనలేక పొగపెడుతోందని ఆరోపించారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దీనిపై ఇప్పటికైనా స్పందించాలని జగన్‌ను కోరారు. ఆంధ్రుల హక్కుగా మనగలుగుతున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం నడుం కట్టాలన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించి, ముడి పదార్థాలు సక్రమంగా సరఫరా జరిగేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. ఈ అంశాలపై ప్రధాని మోదీతో సమగ్రంగా చర్చించాలని సూచించారు.

విచారణ నేటికి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లారని పొన్నవోలు తెలిపారు. వాంగ్మూలం ఇచ్చిన పీవీ రమేష్ మాట మార్చారని, మీడియాలో వేరే విధంగా చెబుతున్నారన్నారు. అయితే పెండ్యాల శ్రీనివాస్, వాసుదేవ్ విదేశాలకు వెళితే చంద్రబాబుకు ఏంటీ సంబంధం? అని సుప్రీం కోర్టు న్యాయవాది దూబే వాదనలు వినిపించారు. వారు విదేశాలకు వెళితే చంద్రబాబుకు బెయిల్ ఇవ్వొద్దనడం సబబేనా? అని అడిగారు. అసలు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు వైపు ఎలాంటి తప్పిదాలు లేవని దూబే వాదించారు. 'అప్పటి ఆర్థిక శాఖ ఉన్నతాధికారి సునీత గుజరాత్ వెళ్లి అధ్యయనం చేశారు. ఆమె అధ్యయనం చేశాక సీమెన్స్ ప్రాజెక్టుకు ఎలాంటి అభ్యంతరం తెలపలేదు. ఎలాంటి అభ్యంతరం లేకుండా ప్రాజెక్టు ఆమోదం పొందిందన్న ఆధారాలు ఉన్నాయి. కాస్ట్ ఎవాల్యుయేషన్ కమిటీ స్కిల్ ప్రాజెక్టు ఎక్విప్‌మెంట్ ధరను నిర్ధారించింది. ఆ కమిటీలో చంద్రబాబు లేరు. కమిటీలో ఉన్న భాస్కరరావు ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. సుప్రీం కోర్టు నవంబరు 16 వరకు ఆయన బెయిల్‌ను పొడిగించింది. చంద్రబాబుకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అరెస్ట్ చేసి ఆ తర్వాత విచారణ చేపట్టారు. రెండు రోజులు కస్టడీలోనూ విచారించారు. ఇప్పుడు మళ్లీ కస్టడీ కావాలంటున్నారు. ఆ అవసరం ఏముంది? కేబినెట్ ఆమోదం పొందాకే సీమెన్స్ ప్రాజెక్టు అమల్లోకి వచ్చింది. కేబినెట్ నిర్ణయం తీసుకుంటే చంద్రబాబుపై కేసు ఎలా పెడతారు?' అని ప్రమోద్‌కుమార్ దూబే వాదించారు. అనంతరం కేసు విచారణ మధ్యాహ్నానికి వాయిదా పడింది. భోజన విరామం అనంతరం ప్రభుత్వం తరపున ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు కొనసాగించారు. 'స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చంద్రబాబు చుట్టూనే తిరిగింది. ముద్దాయిలందరికీ ఏదో ఒక స్థాయిలో ఈ కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత లబ్ధి చేకూరింది. 2018లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ హెచ్చరికల నేపథ్యంలో కంటితుడుపు విచారణకు ఆదేశించింది. ఆ విచారణ తరువాత బుట్ట దాఖలు చేశారు. సామాజిక, ఆర్థిక నేరాల్లో బెయిల్ ఇవ్వొద్దని సుప్రీం కోర్టు తీర్పులున్నాయి. స్కిల్ కేసులో అన్నీ చంద్రబాబు సూచనల మేరకే జరిగాయి' అని ఏఏజీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. రెండు వైపులా వాదనలు విన్న ఏసీబీ కోర్టు విచారణను ఈనెల 5వ తేదీకి వాయిదా వేసింది.

ఫైబర్ గ్రిడ్ కేసులో ముందస్తు బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

ఏపీ ఫైబర్ గ్రిడ్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై కూడా హైకోర్టు విచారణను గురువారానికి వాయిదా వేసింది. బుధవారం నాటి విచారణలో చంద్రబాబు తరపు న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపించారు. వాదనలు కొనసాగింపు కోసం 5వ తేదీకి వాయిదా వేశారు. ప్రక్రియలో లోపాలకు, ఎవరో చేసిన తప్పులకు అప్పటి సీఎంను ఎలా బాధ్యులు చేస్తారని న్యాయవాది వాదించారు. కేసు నమోదు చేసి రెండు సంవత్సరాలయిందని, ఇప్పుడు నిందితుడిగా చేర్చడం ఏమిటని న్యాయవాది ప్రశ్నించారు.

ప్రతీకార చర్యలు సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

వారు నేరానికి పాల్పడ్డారని చెప్పేందుకు కచ్చితమైన ఆధారాలు సేకరించి అరెస్టు చేయాలి తప్ప సమన్లకు సరిగా స్పందించలేదని ఎవరినీ అరెస్టు చేయకూడదని స్పష్టంచేసింది. అరెస్టు సమయంలో అందుకు గల కారణాలను నిందితులకు లిఖితపూర్వకంగా అందించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈడీ మాజీ ప్రత్యేక న్యాయమూర్తి సుధీర్ పర్మార్, అతని మేనల్లుడు రూప్ కుమార్ బన్సాల్ (రియల్టీ సంస్థలో మూడో భాగస్వామి) లంచం ఆరోపణ కేసులో బన్సాల్ సోదరులను ఈడీ అరెస్ట్ చేసింది. దీంతో రూప్‌కుమార్ బన్సాల్, బసంత్ బన్సాల్‌పై సుధీర్ పర్మార్ అభిమానం చూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం ఉందని ఈడీ కోర్టుకు తెలిపింది.

ఎస్ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతి ఘనంగా జరుపుదాం

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు వర్గాల సంక్షేమానికి ఐఏఎస్ అధికారిగా జీవితకాలం కృషి చేసిన ఎస్ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు యేటా ఘనంగా జరుపుకుందామని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగాన్ని ఔపోసన పట్టి 'సంక్షేమం' అనే పదానికి నిర్వచనం ఇచ్చి చట్ట పరిధిలో అమలు చేసిన ఆ మహనీయుడి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను గిరిజన, దళిత, బీసీ, మైనార్టీ, వ్యవసాయ కార్మిక సంఘం, స్వచ్ఛంద సంస్థలు, కార్మికసంఘాల నాయకత్వంలో ఐక్యంగా జరపటానికి అందరికీ ఆమోదయోగ్యమైన విస్తృతంగా కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేసేందుకు జల్లి విల్సన్ నేతృత్వంలో సన్నాహక సమావేశం జరిగింది. విజయవాడలోని డా.బీఆర్ అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్ ఐక్యతా భవన్‌లో బుధవారం జరిగిన ఈ సమావేశంలో జల్లి విల్సన్ మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ వర్ధంతి అక్టోబరు 7న, జయంతి అక్టోబరు 22వ తేదీన ఉభయ రాష్ట్రాల్లో జరుపుకుందామని చెప్పారు. శంకరన్ ఐఏఎస్ అధికారిగా దేశానికి అందించిన సేవలు, ఆయన నిజాయతీని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అందుకోసం శంకరన్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రజాసంఘాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కాలె పుల్లారావు మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్, బాబూజగజ్జీవన్‌రామ్ స్ఫూర్తితో ఎస్ఆర్ శంకరన్ పని చేశారని తెలిపారు. ఆ మహనీయుల ఆశయాలు ముందుకు తీసుకెళ్లిన ఐఏఎస్ అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. ప్రభుత్వాలను ఒప్పించి పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారని గుర్తుచేశారు. శంకరన్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని, ఎస్సీ, ఎస్టీ కమిషన్ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులు తమ వృత్తిధర్మాన్ని మాత్రమే కొనసాగిస్తారని, శంకరన్ మాత్రం తనకు తెలిసిన సామాజిక విజ్ఞానాన్ని ప్రజలకు ఎలా వినియోగించాలని యోచించినట్లు చెప్పారు. సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ద్వారా చేయించటం గొప్ప విశేషమన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగువర్గాలపై వివక్ష కొనసాగుతోందని, దళిత, గిరిజనుల పక్షపాతిగా ఉండే అగ్రకులస్తులను కూడా సమాజం దూరం పెడుతోందన్నారు. శంకరన్ అలాంటి సామాజిక వివక్ష ఎదుర్కొని దళిత, గిరిజనులకు సేవలందించారని చెప్పారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి నాయకులు జి.నటరాజ్, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ నిర్వహకులు మాతంగి హేమలత, నాయీ బ్రాహ్మణ వాయిద్య వృత్తి కళాకారుల శిక్షణా కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు గొనుగొండ్ల యల్లమందరావు, జననీ సర్వీస్ సొసైటీ నిర్వాహకులు మాతంగి ఉమామహేశ్వరరావు, హెల్ప్ ది హోప్‌లెస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఈదులూరి రాధాకృష్ణ, గిరిజన సమాఖ్య నాయకులు కవుటూరు రవి తదితరులు ప్రసంగించారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప అతిథులకు స్వాగతం పలకగా విజయవాడ నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొడాలి ఆనందరావు వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు సంగులు పేరయ్య, కాళ్ల చిన్నప్ప, ఉప్పె నరసింహారావు, పడిగికత్తుల రాము, బూదాల రూఫస్, పి.భాను, ఆదాం, పార్వతి పాల్గొన్నారు.

జల్లి విల్సన్ కన్వీనర్‌గా ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ

ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ ఏర్పాటు చేసి...దాని అధ్వర్యంలో శంకరన్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. కన్వీనర్‌గా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, మరో 30 మంది కో-కన్వీనర్లుగా దళిత, గిరిజన, మైనార్టీ సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యవసాయ కార్మిక సంఘం తదితర ప్రజాసంఘాల నేతలు వ్యవహరిస్తారని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించాలన్న తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

న్యూస్ క్లిక్ పాత్రికేయుల అరెస్టు అమానుషం : ఏపీయూడబ్ల్యూజే

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): న్యూస్ క్లిక్ పోర్టల్ పాత్రికేయుల ఇళ్లు, ఆఫీసులపై దిల్లీ పోలీసులు దాడులు చేసి, అరెస్టు చేయడం అమానుషం అని ఏపీయూడబ్ల్యూజే బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. చైనాతో పోర్టల్‌కు ఆర్థికపరమైన సంబంధాలు కొసాగుతున్నాయని దిల్లీ పోలీసులు ఆగస్టు 17న కేసు నమోదు చేసి చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం కింది పోర్టల్ వ్యవస్థాపకుడు పుర్కాయస్థతో పాటు మరికొందరిని అరెస్టు చేయడం పట్ల ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఉపాధ్యక్షులు కంచర్ల జయరాజ్, విజయవాడ అధ్యక్షులు చావా రవి, కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, సామ్నా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛ, ప్రాథమిక హక్కు అయిన భావ వ్యక్తీకరణపై దాడి చేయడం సరైన చర్య కాదని ఖండించారు. జర్నలిస్టులపై దాడులను ఉద్యమాలతో ఎదుర్కొంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. పథకం ప్రకారం మీడియా సంస్థలపై, జర్నలిస్టులపై దాడులకు, అక్రమ కేసులకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వానికి ఉద్యమాలతోనే తగినరీతిలో బుద్ధి చెబుతామన్నారు. స్వతంత్రంగా పని చేసే జర్నలిస్టులపై, మీడియా సంస్థలపై కేంద్ర ప్రభుత్వం ఒక పథకం ప్రకారం దాడులు చేస్తూ మీడియా గొంతు నొక్కడానికి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఇందులో భాగంగానే న్యూస్ క్లిక్ పోర్టల్‌లో పని చేస్తున్న 46 మంది జర్నలిస్టులను ప్రశ్నించి, కొందరిని అరెస్టు చేయడం దేశంలోని జర్నలిస్టులకు విస్మయం కలిగించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను, అధికార పార్టీ భావజాలాన్ని విమర్శిస్తూ రాసే వారిని లక్ష్యంగా పెట్టుకొని ఈ దాడులు జరుగుతున్నాయని అన్నారు. వీటిని సమైక్యంగా ప్రతిఘటించాలని జర్నలిస్టు సంఘాలకు, మేధావులకు ప్రజాస్వామ్య వాదులకు ఏపీయూడబ్ల్యూజే పంపిన ప్రకటన పేర్కొంది.

సీఎఫ్ఎంఎస్ వ్యవస్థను రద్దు చేయాలి : ఏపీటీఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాఠశాల విద్యా శాఖలో పని చేసే ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అధ్యాపకులకు సంబంధించిన సీఎఫ్ఎంఎస్ వ్యవస్థలో నిరంతరం సమస్యలు ఎదురవుతున్నాయని, తక్షణమే ఆ వ్యవస్థను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్.చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎఫ్ఎంఎస్ వ్యవస్థలో సాంకేతిక సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల నాలుగు నెలల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాల బిల్లులు జమ చేయలేదన్నారు. వేలాది మంది ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు నాలుగు నెలల నుంచి జీతాల మంజూరులో అసౌకర్యం నెలకొందని వివరించారు. తక్షణమే ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నాణ్యతలేని విత్తనాల వల్లే...

మిర్చి పైరుకు బొబ్బర తెగులుపై జమలయ్య

ఎకరాకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారానికి డిమాండ్

విశాలాంధ్ర-ఏకొండూరు: నాణ్యతలేని విత్తనాలతో మిర్చి రైతులు కోలుకోలేని దెబ్బ తింటు న్నారని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పటాపంచల జమలయ్య అన్నారు. నర్సరీల యజమానులు తమ లాభాల కోసం రైతులను నిలువున ముంచుతున్నారని విమర్శిం చారు. పర్యవేక్షణ లోపమే ఈ పరిస్థితికి కారణమని అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జమలయ్య బుధవారం ఏ కొండూరు మండలం, రామచంద్రాపురం, చీమలపాడు గ్రామాలలో సీపీఐ స్థానిక నాయకులు, రైతులతో కలిసి బొబ్బర తెగులు సోకిన మిర్చి తోటలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు అన్నదాతకు హానికరమన్నారు. 2017లో మిర్చిపైరుకు బొబ్బరి తెగులు సోకిన విషయం ప్రభుత్వానికి తెలిసినా తెల్ల దోమ నివారణకు చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్రంలోని ఐదు లక్షలకుపైగా ఎకరాల్లో మిర్చి సాగవు తుందని, ఎన్టీఆర్ జిల్లాలో 50వేల ఎకరాల్లో, ఏ కొండూరులో ఐదువేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు తెలిపారు. బొబ్బరి తెగులుకు ఎన్ని మందులు పిచికారి చేసినా నివారణ కాక రెండు, మూడుసార్లు మిర్చి నారు నాటడం రైతుల వంతు అవుతోందన్నారు. అంత కష్టపడినా పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని, ఇప్పటికే మిర్చి సాగుకు ఎకరానికి రూ.70వేల నుంచి 80 వేల రూపాయల వరకు రైతులు ఖర్చు చేశారని జమలయ్య తెలిపారు. తెగులు నివారణకు వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదని, పంట పెట్టుబడి వృథా అవుతోందని అన్నారు. వ్యవసాయ ఉద్యాన శాఖల ద్వారా రసాయనాలు కానీ పురుగు మందులు కానీ రైతులకు అందడంలేదని చెప్పారు. చదువు లేని అమాయక రైతులను పురుగు మందుల దుకాణదారులు లైసెన్సులు లేని కొన్ని బయో ఉత్పత్తులను పురుగుమందులుగా అంట గడుతూ కోట్లు గడిస్తున్నట్లు చెప్పారు మిర్చి రైతుల నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఎకరా నష్టానికి రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నాణ్యతలేని నాసిరకం విత్తనాలతో తయారైన నారును రైతులకు ఇస్తున్న కంపెనీలపై, నర్సరీల యజమానులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలన్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ ప్రాంతాల్లో పర్యటించి బొబ్బర తెగులు నివారణకు రైతులకు సూచనలు చేయాలని కోరారు. జమలయ్య వెంట నాయకులు మేకల దేవిడ్, గడ్డేటి జోజి బాబు, పి.సర్వేశ్వరరావు, పి.మోహనరావు, మరీదు శివకృష్ణ, లెల్ల రమేశ్, తిరుపతయ్య ఉన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొడతాం

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-కడప: కేంద్రంలో బీజేపీ, ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ అనుసరించే కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జె.రాజారెడ్డి బుధ వారం కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా ఆఫీస్ బేరర్లు, అనుబంధ సంఘాల జిల్లా నాయకులు, పట్టణ కార్యదర్శుల సమావేశం మదనపల్లిలోని ఎఐయూ టీవీ రెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు సరోజమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాజారెడ్డి మాట్లాడుతూ దేశంలో కార్మిక-ప్రజా ఉద్యమాలపై ఎన్నుడూలేని విధంగా పోలీసుల చేత ఉక్కుపాదం మోపుతున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కార్మికులకు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అసెంబ్లీ ఎన్నికలకు ముందే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు, కార్మికులు, శ్రామికులు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 31న జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని కార్మికవర్గానికి రాజారెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, కార్యనిర్వాహక అధ్యక్షుడు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు నరసింహులు, గ్రామ-వార్డు సచివాలయ ఏఎన్ఎమ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతి, జిల్లా కార్యదర్శులు గంగాధర్, సురేశ్‌కుమార్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, వేణుగోపాల్‌రెడ్డి, సలీంభాష, నరసింహులు, దేవ, రాయచోటి, రాజంపేట, మదనపల్లి పట్టణ కార్యదర్శులు పుల్లయ్య, సికిందర్, తిరుమల పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి

సీఎంకు ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బుధవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శిఖరం నరహరి లేఖ రాశారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ఇన్‌స్టంట్ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాల విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటర్ ఫలితాలు విడుదలై ఆరు నెలలు కావస్తున్నప్పటికీ నేటికీ విద్యార్థులకు బోర్డు అధికారులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు అందించలేకపోవడం శోచనీయమన్నారు. ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐటీ, ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ కౌన్సెలింగ్ పూర్తయ్యాయని తెలిపారు. విద్యార్థులు ఆయా కళాశాలల ప్రవేశాల సమయంలో ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు దాఖలు చేయడంలో విఫలమ య్యారని తెలిపారు. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తుపై గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొన్నారు. తక్షణమే సీఎం జగన్ జోక్యం చేసుకుని విద్యార్థులకు ఇంటర్ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

10న సీఎం కార్యాలయం ముట్టడి

ఆటో కార్మికుల భద్రత, సంక్షేమమే ధ్యేయం: దోనేపూడి శంకర్

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్) : ఆటో కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, జీవో నెం 21, 31 రద్దు చేయాలని కోరుతూ ఈనెల 10న సీఎం కార్యాలయం ముట్టడి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, విజయవాడ ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ అనుబంధ సంస్థ, విజయవాడ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో బుధవారం దాసరి భవన్ వద్ద పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి గత ఎన్నికల సందర్భంగా రావులపాలెంలో సభలో అధికారంలోకి రాగానే ఆటో కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి, నేటికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఇటీవల జరిగిన వాహన మిత్ర బహిరంగ సభకు విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు తన అనుచరులను, మహిళలను తరలించటం, అలాగే వేదికపై ఆయన అనుచరులు ఉండటం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం ప్రమాదాల నివారణ పేరుతో జారీ చేసిన జీవో 21, 31 ఆటో కార్మికుల పాలిట శాపంగా మారాయన్నారు. జరిమానాల పేరుతో రూ.500 నుంచి రూ.10 వేల వరకు ప్రమాదాలు, డ్రైవింగ్ లైసెన్సులు, పొల్యూషన్ ఇలా రకరకాల జరిమానాల పేరులతో డబ్బులు వసూలు చేయటం దుర్మార్గమన్నారు. ఆటో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ఈ నెల 10న సీఎం కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో ఆటో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు మాట్లాడుతూ ఆటో కార్మికులకు స్వయం ఉపాధి పథకం క్రింద, నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. జీవోలు 21, 31 ద్వారా భారీ ఎత్తున జరిమానాలు వేయటం సబబు కాదన్నారు. ఆటో కార్మికులకు చిన్న, చిన్న రుణాలు ఇచ్చి, పెద్ద ఎత్తున జరిమానాలు వేసి ఆటో రంగాన్ని దెబ్బతీశారని అన్నారు. ఈ రంగాన్ని కాపాడుకునేందుకు అన్ని కార్మిక సంఘాలను సమీకరిస్తామని హెచ్చరిస్తూ, ఈ నెల 10న సీఎం కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో ఆటో కార్మికులంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విజయవాడ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గూడెల జనార్ధన్, అధ్యక్షులు ఎర్ర రాములు, హాకర్స్ యూనియన్ నగర నాయకులు కొట్టు రమణారావు, యూనియన్ నాయకులు వెంకచ్చి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

7,8 తేదీల్లో విశాఖలో ఇస్కఫ్ జాతీయ సమావేశాలు

విశాలాంధ్ర-విజయవాడ : భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) జాతీయ సమితి సమావేశాలు ఈ నెల 7,8 లలో విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం నందు జరగనున్నాయని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మోతుకూరి అరుణకుమార్, బుద్ధవరపు వెంకట్రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. అంతర్జాతీయ, జాతీయ పరిణామాలు, వివిధ దేశాల మధ్య శాంతి స్నేహసంబంధాలు, ప్రపంచ యుద్ధాలు, పర్యావరణ సమస్యలు వంటి అనేక అంశాలపై చర్చలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంలో 7వ తేదీ సాయంత్రం జాతీయ సమగ్రత, సంస్కృతి పరిరక్షణ అంశంపై సదస్సు జరుగుతుందని తెలిపారు. ఏఎస్‌యూ పూర్వ ఉప కులపతి బాలమోహన్ దాస్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ సభ్యులు కె.ఎస్.చలం, సెంచురియన్ విశ్వవిద్యాలయ కులపతి జీఎస్ఎన్ రాజు, ఇస్కఫ్ జాతీయ చైర్మన్ భానుదేవ్ దత్తా, ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పడిహారి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి తదితరులు వక్తలుగా పాల్గొంటున్నారని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సమావేశం కూడా జరుగుతుందని అరుణకుమార్ పేర్కొన్నారు.

షార్‌లో అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర- సూళ్లూరుపేట: సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలోని ఎంఆర్‌కే ఆడిటోరియంలో అంతరిక్ష వారోత్సవాలను బుధ వారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన కార్యక్రమం ప్రారంభించారు. షార్ డైరెక్టర్ రాజరాజన్ పాల్గొన్నారు. శ్రీహరికోట నుండి మార్క్ 3 ప్రయోగించి చంద్రుడి దక్షిణ ధృవంపై పరిశోధన చేసిన మొట్టమొదటి దేశం మనదేనని సంజయ్ అన్నారు. సూర్యునిపై పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. అంతరిక్షం వారోత్సవాలను బుధ వారం నుండి పదవ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు రాజరాజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాలలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నా మని తెలిపారు. అనంతరం రాకెట్ ప్రయోగం గురించి విద్యార్థులకు స్క్రీన్‌పై వీడియో వేసి చూపించారు. పదవ తేదీ మధ్యాహ్నం శ్రీహరికోటలో 5000 మంది విద్యార్థుల సమక్షంలో చిన్న సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. షార్ కంట్రోలర్ శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సైమన్ అహ్మద్, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బరి నంద్యాలేనా?

అరెస్టు చేసిన ప్రాంతం నుంచే పోటీ మేలన్న ఆలోచన

టీడీపీ శ్రేణుల్లో విస్తృత చర్చ



విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: నంద్యాలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. నంద్యాల పార్లమెంటు స్థానం నుంచి అత్యధిక మెజారిటీతో విజయం సాధించి దేశానికి తెలుగువాడిని ప్రధానిని అందించిన గడ్డ. రాష్ట్రపతిని, కేంద్ర హోం మంత్రిని, గవర్నర్‌లను అందించి అందరి దృష్టిని ఆకర్షించిన ప్రాంతం. ఇటీవల టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును నంద్యాలలో అరెస్టు చేయడంతో మరోసారి నంద్యాల అందరి దృష్టిని ఆకర్షించింది. నంద్యాల మొదటి నుంచి టీడీపీకి మంచి పట్టు ఉన్న నియోజకవర్గం. భూమా నాగిరెడ్డి నంద్యాల పార్లమెంటు నుంచి వరుసగా మూడుసార్లు ఎంపీగా విజయం సాధించారు. 2014 ఎన్నికల తరువాత ఇక్కడి నుంచి విజయం సాధించిన భూమా నాగిరెడ్డి ఆకస్మిక మృతితో అనివార్యమైన ఉప ఎన్నికలలో టీడీపీ విజయం సాధించింది. అధికార టీడీపీ, అప్పటి ప్రతిపక్ష వైసీపీ ప్రత్యేక దృష్టి సారించడంతో ఆ ఉప ఎన్నికలు హోరాహోరి సాగాయి. టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయం సాధించారు. ఇటువంటి నంద్యాల నుంచి ప్రతిపక్ష నేత, టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికలలో బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయని ప్రచారం ఊపందుకుంది. సెప్టెంబరు 9న నంద్యాలలో చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం, ఆ తరువాత నెలకొన్న పరిస్థితుల కారణంగా చంద్రబాబు ఇక్కడి నుంచి బరిలోకి దిగితే ఎలా ఉంటుందనే ఆలోచనలో పార్టీ శ్రేణులు ఉన్నాయి. అయితే నంద్యాల నుంచి బరిలో నిలవాలని అనేక మంది నేతలు ఎవరికివారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తిరిగి పోటీ చేసేందుకు ప్రయత్నం చేస్తుండగా, మాజీ డిప్యూటి స్పీకర్ ఫరూక్ కూడా ఈ సారి బరిలో నిలవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు, భూమా ప్రధాన అనుచరుడు ఏవీ సుబ్బారెడ్డి కూడా నంద్యాల సీటును ఆశిస్తున్నారు. ఇక భూమా నాగిరెడ్డి కుమారుడు భూమా జగత్‌విఖ్యాత రెడ్డి కూడా తన తండ్రి పోటీ చేసిన సీటులో తాను పోటీ చేస్తానని, తమకు ఆళ్లగడ్డ, నంద్యాల రెండు కూడా రెండు కళ్ల లాంటివని అంటున్నారు. ఇలా నంద్యాల సీటుపై అనేక మంది నేతలు గురిపెట్టడం పార్టీ నాయకత్వానికి కూడా ఇబ్బందిగా మారింది. కుప్పం నుంచి ఇప్పటికి మూడు దశాబ్దాలుగా విజయం సాధిస్తూ వస్తున్న చంద్రబాబు కుప్పంను పెద్దఎత్తున అభివృద్ధి చేశారు. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న కుప్పంకు ఒక యూనివర్సిటీ ఏర్పాటు చేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. నంద్యాలలో అనేక మంది నేతలు పోటీ పడుతుండటంతో చంద్రబాబు నంద్యాల నుంచి బరిలో దిగితే ఎలా ఉంటుందనేది ఇప్పుడు చర్చ సాగుతోంది. టీడీపీ గతంలో నంద్యాల పట్టణంలో రోడ్డు వెడల్పు కార్యక్రమానికి పెద్దఎత్తున నిధులు ఖర్చు చేసింది. దీనికితోడు ఎక్కడ అయితే ప్రభుత్వం అరెస్టు చేసిందో అక్కడ నుంచి పోటీ చేస్తే ఎలా ఉంటుందనేది పార్టీలో అంతర్గతంగా చర్చ సాగుతోంది. చంద్రబాబు నంద్యాల నుంచి పోటీ చేయడం వలన ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలో టీడీపీ నేతల్లో ఉత్సాహం వస్తుందని పార్టీ శ్రేణులు లెక్కలు కడుతున్నాయి. ఇప్పటికే కొంతమంది ఈ విషయం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. అక్టోబరు 30న నంద్యాల పట్టణంలో చంద్రబాబును అరెస్టు చేసిన ఆర్‌కే ఫంక్షన్ హాలులోనే పీఏసీ సమావేశం కూడా నిర్వహించారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు ఎంపీ సీట్లు, 14 శాసనసభ స్థానాలను వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ముఖ్యంగా ధరల పెరుగుదల, రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, రాష్ట్రంలో ఇసుక ధర పెరిగిపోవడం, మద్యం ధరలు పెరగడంతో పాటు ప్రభుత్వం దశలవారీ మద్య నిషేధం చేస్తానని చెప్పి, మరల ఏడాది పాటు మద్యం లైసెన్స్‌లు రెన్యువల్ చేయడం చూస్తే ప్రభుత్వానికి మద్య నిషేధంపై చిత్తశుద్ధి లేదని తెలుస్తోంది. అలాగే భూకబ్జా, దౌర్జన్యాలు పెచ్చుపెరిగిపోవడంతో పాటు ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టడం ఇలా అన్ని వర్గాలలో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టమవుతోంది. తాను అధికారంలోకి వస్తే రెండు వారాల్లో సీపీఎస్ అమలు చేస్తానని స్వయంగా హామీ ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి నేడు సీపీఎస్ స్థానంలో జీపీఎస్‌ను తీసుకురావడాన్ని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. నేడు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించి జైలులో పెట్టడం వలన సామాన్య, మధ్యతరగతి ప్రజలతో పాటు తటస్థులు కూడా టీడీపీ వైపు మొగ్గుచూపుతుండటం ఆ పార్టీకి కలసి వచ్చే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు నంద్యాలలో పోటీ చేయడం వలన టీడీపీకి అనుకూలంగా మారుతుందనేది పార్టీ శ్రేణుల అభిప్రాయం. అయితే చంద్రబాబు కుప్పం వదలి నంద్యాల వస్తారా అన్నది కూడా ఆలోచించవలసిన విషయమే. ఆయనకు మూడు దశాబ్దాల నుంచి అక్కడ అనుబంధం ఉంది. దీనికి తోడు రెండు స్థానాల్లో పోటీ చేయడానికి ఆయన సుముఖత వ్యక్తం చేస్తారా అనేది కూడా అనుమానమే. ఏది ఏమైనా చంద్రబాబు బయటకు వచ్చిన తరువాత ఈ విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నేడు ఉక్కు రక్షణ యాత్ర ముగింపు సభ: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, మోదీ సర్కారు వైఖరికి నిరసనగా సీపీఎం చేపట్టిన ఉక్కు రక్షణ యాత్ర ముగింపుసభ ఈనెల 5వ తేదీన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ మెయిన్‌గేట్ (కూర్మన్నపాలెం జంక్షన్) వద్ద జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగింపు సభలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేసేలా ప్రజలు పెద్దఎత్తున పాల్గొని సభను జయప్రదం చేయాలన్నారు. సెప్టెంబర్ 20న విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన యాత్ర ఆరు జిల్లాలలో 1500 కిలోమీటర్లు, 12 రోజులపాటు సాగిందన్నారు. 150 సెంటర్లలో జరిగిన సభలలో 30 వేలమంది ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. యాత్రకు సంఘీభావంగా వందల సంఖ్యలో బైకులతో ప్రజలు పాల్గొన్నారన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల నుంచి నిరసన వ్యక్తమైందని, యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన కనిపించిందని తెలిపారు.

సంపాదకీయం

కులగణన సామాజిక అవసరం

కులనిర్మూలన ఉదాత్తమైన ఆశయమే కావచ్చు. కానీ అది ఇంతవరకు సాధ్యం కానేలేదు. మన సమాజంలో కులవ్యవస్థ ఘనీభవించి ఉంది. వివిధ కులాల అస్తిత్వవాదమూ బహిరంగంగానే వ్యక్తం అవుతోంది. కానీ ఏ కులంవారు ఎంతమంది ఉన్నారన్న గణాంకాలు నికరంగా లేవు. రాజ్యాంగ రచన సమయంలో సామాజికంగా, విద్యాపరంగా ఎస్.సి.లకు 15 శాతం, ఎస్.టి.లకు 7శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఇవి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికోసం ఉద్దేశించినవి. సామాజికంగా, విద్యాపరంగా తరతరాలుగా వెనుకబడిన కులాలకు చెందినవారు ఎదగడానికి రిజర్వేషన్లు సానుకూల చర్యకు అవకాశం కల్పిస్తాయనుకున్నారు. మండల్ నివేదిక ఆధారంగా ఇతర వెనుకబడిన కులాలవారు 52 శాతం ఉన్నారని 1931 నాటి జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించారు. వారికి 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఇదంతా దాదాపు 80 ఏళ్ల కిందటి జనగణన ఆధారంగానే సాగుతోంది. కానీ ఎవరి జనాభా ఎంతో వారికి అంత శాతం హక్కులు అన్నది లోహియా వాదుల అభిప్రాయం. 1951 నుంచి జరిగిన కులగణనలో కులాల వివరాలు చేర్చకపోవడంతో పాత లెక్కల ఆధారంగానే సానుకూల చర్యలు తీసుకుంటున్నాం. ఇది అన్యాయం, కులగణన జరిపించి ఆ వివరాల ఆధారంగా అవసరమైన కులాలన్నింటికీ సానుకూల చర్యలు వర్తింపచేయాలన్నవాదన గత ఇరవై ఏళ్లుగా వినిపిస్తూనే ఉంది. 2021 జనాభా లెక్కలు ప్రారంభించాలనుకున్నప్పుడు కులగణన ఉండాలన్న వాదన మరింత బలం పుంజుకుంది. కానీ సాధ్యం కాలేదు. కరోనావల్ల జనాభా లెక్కల సేకరణకు ఆటంకం ఎదురైంది. ఎప్పుడు పూర్తి అవుతుందో తెలియదు. ఈ లోగా బిహార్ ముఖ్యమంత్రి బిహార్‌లో కులగణన జరిపిస్తామని శాసనసభలో తీర్మానం ఆమోదింపచేశారు. బీజేపీ అగ్ర నాయకులు కులగణనకు వ్యతిరేకమైనప్పటికీ బిహార్‌లోని బీజేపీ నాయకులూ దీన్ని ఆమోదించారు. అక్కడ బీజేపీలో కూడా వెనుకబడిన వర్గాల వారిదే ఆధిపత్యం కావడమే దీనికి కారణం. అక్టోబర్ రెండవ తేదీన నితీశ్ కుమార్ బిహార్ కులగణన వివరాలను వెల్లడించారు. ఇందులో ఆశ్చర్యకరమైన అంశాలు బయట పడ్డాయి. ఇంతవరకు బి.సి.లు 52 శాతం అన్న కాకి లెక్కల ఆధారంగా ముందుకు సాగుతుంటే బిహార్ లో ఇతర వెనుకబడిన కులాలవారు 63 శాతం అని తేలింది. ఈ కులగణనలో బిహార్‌లో అత్యంత వెనుకబడినవర్గాలు అన్న కొలమానాన్ని చేర్చారు. దీనివల్ల ఇతర వెనుకబడిన కులాలవారు 27.13 శాతం, అత్యంత వెనుకబడిన వర్గాలవారు 36.1 శాతం ఉన్నారు. వెరసి ఇతర వెనుకబడిన కులాలవారు 63 శాతం అని తేలిపోయింది. ఇందులో శూద్ర, ఉత్పత్తి, బహుజన వర్గాలవారు ఉన్నారు. దేశమంతా ఎస్.సి.లు 15 శాతం అన్న అంచనా ఉంది. కానీ బిహార్‌లో వారు 19.65 శాతం అని రుజువైంది. అంబేద్కర్ సూచన ప్రకారమే 1953 జనవరి 29న వెనుకబడిన కులాల వారికి సంబంధించిన వివరాలు సేకరించడంకోసం కాకా కాలేల్కర్ కమిషన్ ఏర్పాటు చేశారు. ఆయన నివేదిక సిద్ధంచేసి ప్రభుత్వానికి అందజేశారు. కానీ విచిత్రంగా ఈ నివేదికను తాను నమ్మడం లేదని ఆయనే మౌఖికంగా చెప్పారు. దీనితో ఇతర వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్ల అమలు బాధ్యతను అప్పటి ప్రధానమంత్రి నెహ్రూ రాష్ట్రాలకే వదిలేశారు. దీనికీ కారణం లేకపోలేదు. కులాలు అసంఖ్యాకంగా ఉన్న మన దేశంలో ఒక రాష్ట్రంలో వెనుకబడిన వర్గం కిందకు వచ్చే కులం మరో రాష్ట్రంలో వెనుకబడి ఉండకపోవచ్చు. అందుకే వెనుకబడిన తరగతుల వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించే బాధ్యత రాష్ట్రాల పరిధిలోనే ఉండాలని నెహ్రూ భావించి ఉండవచ్చు. కానీ మండల్ కమిషన్ నివేదిక వెలువడే దాకా ఇతర వెనుకబడిన కులాలగురించి పట్టించుకున్నదే లేదు. ఆ నివేదికకూడా వెంటనే అమలుకాలేదు. విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ మండల్ నివేదిక దుమ్ముదులిపారు. అమలుకు మరికొంత కాలంపట్టింది. అయితే వెనుకబడిన తరగతులవారు ఎవరు అన్న విషయాన్ని నికరంగా జనాభా లెక్కల ఆధారంగా కాకుండా 1931 నాటి జనాభా లెక్కల ప్రకారమే నిర్ణయించేశారు. ఇప్పటికీ అదే పద్ధతి కొనసాగుతోంది. అందుకే ఈ మధ్య కాలంలో కులగణన అవసరం అన్న అభిప్రాయానికి బలం చేకూరింది. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కులగణనను వ్యతిరేకిస్తోంది.

మన దేశంలో బ్రిటిష్ వారి ఏలుబడిలో 1881లో జనాభా లెక్కలు సేకరించడం మొదలైంది. అందులో కులాల, మతాల, జాతుల, మాట్లాడే భాషల, ఆర్థిక స్థితి వివరాలూ ఉండేవి. 1881 నుంచి 1931వరకు జనాభా లెక్కల్లో కులాలను కూడా నమోదుచేసే వారు. 1941లోనూ ఈ వివరాలు సేకరించినా జనాభా లెక్కల నివేదిక ప్రచురించడం సాధ్యం కాలేదు. అంటే 1941 లెక్కల్లో ఏ కులాలవారు ఎంతమందో అధికారికమైన ఆధారంలేదు. వలసపాలన ముగిసిన తరవాత 1951లో జనాభా లెక్కలు సేకరించినా అందులో కులాల వివరంలేదు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడినవారికి రిజర్వేషన్లు కల్పించడాన్ని సానుకూలమైన వివక్ష అంటున్నాం. ఈ వివక్ష రక్షణాత్మకమైంది. ఇతర వెనుకబడిన కులాలకోసం సానుకూల చర్య అవసరాన్ని రాజ్యాంగ నిర్మాయక సభ కూడా చర్చించింది. కానీ ఆ చర్చ అస్పష్టంగానే ఆగిపోయింది. వెనుకబడిన కులాల వారికి దామాషా పద్ధతిలో అవకాశాలు కల్పించాలని మండల్ కమిషన్ తెలియజేసింది. ఇది ప్రజాస్వామ్యబద్ధమైందే. 2021లో జనాభా లెక్కలు సేకరించాలనుకున్నప్పుడు కులగణన అవసరం బలంగా ప్రస్తావనకొచ్చింది. బీజేపీ మినహా వివిధ పార్టీలు దీనికి అనుకూలంగానే ఉన్నాయి. కానీ కొన్ని పార్టీలవైఖరి అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా లేనప్పుడు మరో రకంగాఉంది. కులగణన అంటే సమాజాన్ని చీల్చడమే అన్నది బీజేపీ వాదన. ఇందులో అందరికన్నా పెద్ద గొంతుక ప్రధాని మోదీదే. సమాజం అనేక రకాలుగా చీలిపోయి ఉన్నప్పుడు దాన్ని అంగీకరించకపోవడం వాస్తవాలనుంచి పలాయనం చిత్తగించడమే. నితీశ్ కుమార్ 2023 జనవరిలో కులగణన ప్రారంభించి అక్టోబర్ రెండున ఆ వివరాలు వెల్లడించారు. ఇది శూద్ర, ఉత్పత్తి, బహుజన కులాల గురించి మాట్లాడుతున్న వారికి కొత్త సరంజామా అందిస్తుంది. ఈ కులగణన ప్రకారం బిహార్ లో రెండంకెల జనాభా ఉన్నది కేవలం యాదవులే. యాదవులలోని ఏడు ఉపకులాలను కలిపితే వారి సంఖ్య 14.26 శాతం ఉంది. మిగతా అన్ని కులాలు ఒక అంకెకే పరిమితం. కులగణన నిజానికి సామాజిక అంశం. నికరమైన లెక్కలు అందుబాటులో ఉంటే వివిధ పథకాలను ఎలారూపొందించాలో అర్థం అవుతుంది. ప్రభుత్వం మెరుగైన విధానాలు రూపొందించవచ్చు. ఇతర రాష్ట్రాలలో కూడా శాస్త్రీయ పద్ధతిలో కులగణన జరిపించవలసిన అవసరం ఉంది.

ఎన్నాళ్లీ కట్టు కథలు పుక్కిటి పురాణాలు

డా. యం.సురేష్ బాబు

ఇంతన్నాడింతన్నాడే గంగరాజు ముంతమామిడి పండన్నాడే గంగరాజు, ఏ హస్కన్నాడు, బుస్కన్నడే గంగరాజు, నన్నొగ్గేసేల్పోన్నడే గంగరాజు అన్నట్లు ఉంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు. ఈ మధ్య సినిమా నటులనటన, డైలాగ్ డెలివరీ తలదన్నేట్లు ప్రసంగాలు ఉంటున్నాయి. ప్రజలు న్యూస్‌ఛానెల్స్‌లో ఎంటర్‌టైన్‌మెంట్ చూస్తున్నారు. దేశంలో హరిదాసులు, పిట్టలదొరలు, పగటి వేషగాళ్ళు అంతరించి పోయాయని బాధపడేవారు ఇప్పుడు నాయకుల ప్రసంగాలలో వారిని చూసుకుంటున్నారు. ప్రధానమంత్రినుండి రాష్ట్ర మంత్రులు మాటతీరు పగటివేషగానికి ఎక్కువ పిట్టలదొరకు తక్కువ అన్నట్లుఉంది. మూడు సంవత్సరాల కిందట కేసీఆర్, మోదీల మధ్య జరిగిన సంభాషణను గుండెల్లో దాచుకొని నిన్ననే తెలంగాణగడ్డపై ఉద్వేగపూరిత వాతావరణంలో ఛలోక్తులు విసురుతూ ప్రజలకు విడమరచి చెప్పారు. కేసీఆర్ మోదీ కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూడలేదని, అవినీతి కేసీఆర్ తన పంచన చేరలేదని తన పార్టీలో అవినీతికి, కుటుంబ రాజకీయాలకు తావుండదని తేల్చి చెప్పారు. కార్పొరేటు ఎగవేతదారులు ఎక్కువమంది బీజేపీకివారే. ఎల్ఐసి, ప్రభుత్వరంగ బ్యాంకులు, సంస్థలకు కుచ్చుటోపీ పెట్టినవారు ఏ పార్టీలో ఉన్నారో తెలిసిందే. జెడిఎస్ కుమారస్వామి, అప్నాదళ్ అనుప్రియ పటేల్, చిరాగ్ పాశ్వాన్ పార్టీలు ఎన్‌డీఏలో ఉన్న సంగతి తెలియదా? కోట్లకు కోట్లు బ్యాంకులను ముంచిన సుజనా చౌదరి, సియం రమేష్, కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఈడీ కేసులు ఉన్న జోతిరాదిత్య సింధియా, బిసిసిఐ జయ్ అమితాబ్ భాయ్ షా ఏ పార్టీలో ఉన్నారో తెలియదా? తెలంగాణ పురపాలకశాఖ మంత్రి మాట్లాడుతూ కూటిలో రాయి తీయనోడు ఏటిలో రాయి తీస్తాడా అని మాట్లాడాడు. అవును మీరు పురపాలకశాఖమంత్రిగా ఉండి మీరు నివసించచే ప్రాంతంలో డ్రైనేజ్ పైపులు పగిలి నిత్యం రోడ్డు మురుగునీటితో తడిసి ముద్దవుతున్నాయి.

నాళాలలో గత రెండునెలల్లో ఏడుగురు చనిపోయారు. వర్షం పడిందంటే వణుకు పుడుతుంది. రాష్ట్ర ప్రజలకు నీళ్ళు, నిధులు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యంకానీ, కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. సచివాలయం నిర్మాణం, బతుకమ్మ చీరల పంపిణీ, యాదాద్రి అభివృద్ధికి నిధులు వెచ్చించడంపై దృష్టి కేంద్రీకరించిన కేసీఆర్, రాష్ట్రంలో నిరుద్యోగం, ఉపాధి లేక యువత తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు. ప్రభుత్వబడుల్లో పదహారువేల టీచర్ పోస్టులుఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో పదివేలకుపైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉండి విశ్వవిద్యాలయాల్లో శ్మశాన ప్రశాంతత నెలకొంది. సర్కారు బడులలో సకల వసతులు అని ప్రచార ఆర్భాటాలకు పరిమితమై, తన అనుచరగణం నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు పెద్దఎత్తున సహకారం అందిస్తూ విద్యా వ్యాపారాన్ని పోషిస్తూ బహుజనులకు విద్యను దూరంచేసి సర్వనాశనం చేశారు. సుస్థిర అభివృద్ధి మా డిఎన్ఏలో ఉందని, నగరమంతా డప్పు కొట్టుకుంటున్నారు. దేశంలోనే వైద్యవిద్యకు పెద్దపీట వేశామని ఫ్లెక్సీలు కట్టి ప్రచారం చేస్తున్నారు. వైద్య విద్య బోధించడానికి అధ్యాపకులు లేరు, పదిహేను సంవత్సరాల కిందట వెలసిన రిమ్స్ ఆదిలాబాద్‌లో పట్టుమని పదిమంది శాశ్విత అధ్యాపకులు లేరు, కొత్తగా వచ్చిన వైద్య కళాశాలల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో చెప్పనక్కర్లేదు. నగరం నడిబొడ్డున ఉన్న నేచురోపతి, ఆయుర్వేదిక్, యునాని, హెూమియోపతి కళాశాలల్లో పట్టుమని నలుగురు అధ్యాపకులు లేరు. అక్కడ విద్యార్థులకు అనాటమీ, పెథాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజి ప్రొఫెసర్లు లేక గాంధీ ఉస్మానియా కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. వంద సంవత్సరాలు ఘనకీర్తి గడించిన ఉస్మానియా విశ్వవిద్యాలయము, సాంకేతికకు మారుపేరుగాఉన్న జేఎన్టీయూ హైదరాబాద్, ఉత్తర తెలంగాణలో తలమానికంగా ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయం అధోగతి పట్టించిందెవరు? అలాగే కేంద్రప్రభుత్వ అధీనంలో ఉన్న సంస్థలు ఎన్జిఆర్ఐ, ఐఐసిటి, జీఎస్ఐ, జినోమ్, సిడిఎఫ్‌డీ, ఫుడ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, సెంట్రల్ ఫార్మాఇన్‌స్టిట్యూట్, డిఎల్ఆర్ఎల్ నిధులు లేక నీరసించిన సంగతి తెలియదా? ట్రాఫిక్ నియంత్రణ లేకుండా పోయింది. సంస్కరణల ద్వారా అనధికారిక రంగం అధికారికీకరణను ప్రోత్సహించడం, కార్మికులకు మెరుగైన వేతనాలు, సామాజిక భద్రత, క్రెడిట్, శిక్షణ పొందడం, వృత్తి విద్యలపట్ల పునశ్చరణ తరగతులు నిర్వహించడం, నైపుణ్యాలను పెంచడం వంటివి పట్టించుకున్న పాపానపోలేదు. నగరంలో వెలసిన ఎంఎస్ఎంఇ, జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, సెంట్రల్ టూల్ డిసైన్, మేనేజ్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసర్చ్ పనితీరు పూర్తిపేలవంగా ఉంది. ప్రాంతీయ అసమానతలను తగ్గించడానికి వెనుకబడిన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ పారిశ్రామికీకరణలో పెట్టుబడి పెట్టడం ద్వారా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించడం.ఈ సమస్యలను పరిష్కరించడం ద్వారా, భారతదేశం పట్టణీకరణ ప్రయోజనాలను ఉపయోగించుకోవచ్చు, రంగాలలో సమానమైన వృద్ధిని ప్రోత్సహించవచ్చు.సమగ్రమైన, స్థిరమైన అభివృద్ధి పథాన్ని నిర్ధారిస్తుంది. సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ, సవాళ్లు, పరిమితులు ఉన్నాయి. విజ్ఞతగల ప్రజలు రానున్నకాలంలో అవకాశవాద మతోన్మాద పార్టీలకు బుద్ధి చెబుతారని ఆశిద్దాం.

హింసపై తిరగబడిన సామాన్యులు

సందేశ్ ఒక చిన్న గ్రామం. గుజరాత్ ఆనంద్ జిల్లా ఆనంద్ తాలూకాలో ఉంది. 2002లో గుజరాత్‌లో విద్వేషం, ప్రతీకారం హెచ్చినవేళ పాలకుల అండదండలతో జరిగిన సామూహిక హననంలో సామాన్యులు ప్రతిఘటనకు ఈ గ్రామం ఆదర్శంగా నిలిచింది. సందేశ్ గ్రామంలో హిందువులు ఎక్కువే. అత్యంత సాహసవంతులైన మోతీభాయ్, ఉమర్‌భాయ్ ఒరాలనేగాక, అనేకమంది వ్యాపారులను తదితరులను రక్తదాహంతో ఊగిపోతున్న గుంపునుంచి రక్షించారు. 2002 ఫిబ్రవరి 27న గోద్రా వద్దసామూహిక దహనం జరిగిందో అప్పుడే గ్రామంలోనూ దాడులు జరుగుతున్నాయని వదంతులు వ్యాపించాయి. అయితే స్థానిక హిందువులు ఈ వదంతులు కొట్టివేశారు. ఏమీ జరగదని స్థానిక హిందువులు, ముస్లింలను సముదాయించేందుకు ప్రయత్నించారు. గ్రామంలో ఏదైనా అల్లరిజరిగితే తాను తన తలనరికి వేసుకుంటానని గోవింద భాయ్ పటేల్ సవాలు చేశారన్న విషయాన్ని ముస్తఫభాయ్ గుర్తు చేశారు. అయితే ఒరాలు సంతృప్తి చెందలేదు, ముందు జాగ్రత్తచర్యగా తన కుటుంబ సభ్యులను నప గ్రామంలో ఉన్న తన సోదరి వద్దకు పంపాడు. ఇది జరిగిన రెండురోజుల తర్వాత దాదాపు రెండువేలమంది మూక ముస్లింలపై దాడి చేసి చంపేందుకు వచ్చారు. అత్యంత విచారకరం ఏమిటంటే గోవిందభాయ్ పటేల్‌కూడా ఆ వచ్చిన మూకలో భాగం కావడం. విషం చిమ్ముతూ ఆకస్మికంగా దాడిచేశారు.

తన షాపు వద్దనున్న మొహమ్మద్ భాయ్ పెద్ద గొడవ జరగబోతుందని గ్రహించాడు. మోతీభాయ్ అతనిని గమనించింది. అతను భయాందోళనలకు లోనైనట్లు గ్రహించింది. వెంటనే తన ఇంట్లోకి రమ్మని మొహమ్మద్ భాయ్‌ను పిలిచారు. వెంటనే మొహమ్మద్ భాయ్ మోదీ భాయ్ ఇంట్లోకి వెళ్లి తన ప్రాణాలు కాపాడుకున్నాడు. ఇది జరిగిన ఐదు గంటలకు పోలీసులు వచ్చారు. అప్పుడు మొహమ్మద్‌భాయ్ పోలీసు వ్యానులో నప గ్రామానికి వెళ్లిపోయాడు. పెద్ద గుంపు తమ ఇంటివైపు వస్తున్నట్లు విన్నప్పుడు ముస్తఫభాయ్ ఇంట్లోనే ఉన్నాడు. రోడ్డు మీదుగా గుంపు వస్తున్నప్పుడు సోనుభాయ్ కుటుంబం ఆ అలజడి శబ్దాన్ని విన్నది. తన కోడలు రూపబెహన్ ఏదో ప్రమాదం ముంచుకొస్తుందని గుంపుకేకలు విని తెలుసుకుంది. తన పిల్లలు తానుకూడా భయపడిపోయి ఏడ్చామని చెప్పింది. వెంటనే ముస్తఫబాయ్ భద్రత గురించి సోనుభాయ్ ఆలోచించారు. ఆ వచ్చిన గుంపు ముస్తఫభాయ్ ఇంటిపైన వెనుకనుండి దాడి చేశారు. ఇది సోనుభాయ్‌కి మంచి అవకాశం ఇచ్చింది. ముస్తఫభాయ్ కుటుంబాన్ని ఇంటిముందు ద్వారం ద్వారా తన ఇంటికి తీసుకువెళ్లి కాపాడాం. ఇది గ్రహించిన గుంపు సోనుభాయ్ ఇంటికి ముస్తఫబాయ్‌ని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అయితే సోనుభాయ్ ఆయన కుటుంబసభ్యులు ముస్తఫబాయ్‌ని అప్పగించేది లేదని ప్రతిఘటించారు. అప్పుడు ఆ వచ్చిన గుంపు సోనుభాయ్ ఇంటిని తగలబెడతామని బెదిరించారు. అయితే ఇంటి బైటున్న షెడ్‌ను తగలబెట్టారు. ఇల్లు కాల్చివేస్తామని బెదిరించినప్పటికీ ముస్తఫభాయ్‌ని అప్పగించబోమని కుటుంబ సభ్యులంతా తెగేసి చెప్పారు. అంతేకాదు, గ్రామాన్ని వదలి వెళతామని, ముస్తఫబాయ్‌ని కూడా వెంట తీసుకు వెళతామని చెప్పారు. అంతిమంగా ఆ గుంపు వెళ్లిపోయింది. ఐదుగంటల తర్వాత గొడవ సద్దుమణిగిన తర్వాత సోనుభాయ్ తన కారులో ముస్తఫభాయ్‌ని తీసుకునివెళ్లి నపలో వదలి పెట్టివచ్చారు.

ఇలాంటి సంఘటనే వదోదర నగరం రఫీ దర్గా ప్రాంతంలో జరిగింది. ఆ ప్రాంతాన్ని మచిచ్చి పీర్ అంటారు. అక్కడ 2వేల కుటుంబాలు నివసిస్తున్నాయి. వాళ్లలో 70-80హిందూ కుటుంబాలు ఉన్నాయి. సందేశ్ గ్రామంలో ద్వేషం రగిలిపోతూ వచ్చిన గుంపును ధైర్యంగా ప్రతిఘటించినట్లుగానే ఎదిరించారు. హిందువులు ఎక్కడికి వెళ్లకుండానే వాళ్లను ముస్లింలు కాపాడారు. "మేము కొంచం భయాందోళనకు గురయ్యాము. అయితే మేము ముస్లింలను నమ్మాము. మా దగ్గరకు వచ్చి ఇక్కడే ఉండండి అని మా బంధువులు కోరారు. అయితే మేము వెళ్లడానికి సిద్ధపడలేదు. రాలేమని చెప్పాము" అని అక్కడ నివసించే తృప్తి బెహన్ చెప్పారు. హిందువులు అక్కడే జీవించడానికి ముస్లింలు అన్ని విధాలుగా సహకరించారు. ఆ ప్రాంతంలో నివసించే ఎక్కువమంది హిందువులు పేదలు, రోజువారీ పనులు చేసుకుని జీవించేవారే. ఆ పట్టణంలో హింసాకాండ ఎక్కువగా జరగడంతో పేదలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఇరుగుపొరుగున నివసించే ముస్లింలు హిందువులకు వంటసామాన్లు, ఆహారధాన్యం తదితర వస్తువులు అందచేశారు. దీనివల్ల అక్కడే హిందువులకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదు.

హిందువులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్న ముస్లింలకు అవసరమైన సహాయ సహకారాలు హిందువులు అందించారు. రెండు మతాలవారు పరస్పరం సహకరించుకొని శాంతి, సామరస్య వాతావరణంలో జీవించారు. వదోదర పట్టణంలో మెహబూబ్‌పుర ప్రాంతంలోనూ పరస్పరం సహకరించుకొని ప్రశాంతంగా ఉన్నారు. అయితే మచిచ్చి పీర్ ప్రాంతంలోని ప్రధాన రహదారిపైన తీవ్రమైన ఘటనలు జరిగాయి. ఆ ప్రాంతంలో ఉన్న ముస్లింలు, పోలీసులు లేదా ఇతర ప్రాంతాలనుంచి వచ్చిన హిందువుల మధ్య ఘర్షణలు జరిగాయి. మచిచ్చి పీర్‌లో మాత్రం ప్రశాంతంగా ఉన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన రమేష్‌భాయ్ ఆ ప్రాంతంలో బాధ్యత తీసుకొని క్రమం తప్పకుండా పెద్దలను, రెండుమతాలకు చెందిన పలుకుబడిగల వాళ్లను సమీకరించి సమావేశాలు ఏర్పాటుచేసి, చర్చించి తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. బాగా పొద్దుపోయేవరకు రెండుమతాలవాళ్లు ఒక చోట కూర్చుని కాపలా కాశారు. తమ తమ మతాలకు చెందిన వారితో పెద్దలు మాట్లాడుతూ, ప్రశాంతతను నెలకొల్పారు. వదంతులను, దురవగాహనలపై ఎప్పటికప్పుడు వివరించేవారు. అయితే కొన్నిచోట్ల రాళ్లు విసురుకున్న ఘటనలు జరిగాయి. 2002 మార్చి 3న రాత్రి రఫియా దర్గా ప్రాంతంలో దాడులు జరిగినట్లు వదంతులు వచ్చాయి. దర్గా వద్దనే ఉండే బాబాసయద్ అహసముద్దీన్ రఫియాపైన ప్రజలకు ఎంతో నమ్మకంఉంది. పోలీసులను ఎన్నిసార్లు పిలిచినా రాలేదు. రమేష్‌భాయ్ దర్గా వద్దకు ఒక్కడే తన కారులో వెళ్లాడు. దారిలో సాయుధులైన గుంపులు కనిపించాయి. బాబా దర్గా వద్ద నుండి వెళ్లిపోవడానికి తిరస్కరించారు. అయితే కుటుంబ సభ్యులను తండాలకు పంపాలని కోరగా రమేష్‌భాయ్ దాదాపు దజన్లమందిని తీసుకునివెళ్లి తండాలలో వదిలిపెట్టారు. అప్పుడు కర్ఫ్యూఉంది. రోడ్లపైన సాయుధగ్రూపులు ఉన్నా లెక్కచేయకుండా రమేష్‌భాయ్ తండాలకు వెళ్లారు. ఆయన అనేకమంది ముస్లింలను రక్షించారు.

(గుజరాత్‌లో 2002లో జరిగిన మారణకాండపై సామాజిక కార్యకర్త తీస్తాసెతల్వాద్ రాసిన 'పీస్ మేకర్స్ పుసక్తం నుండి)

అభివృద్ధి, కార్మిక హక్కులే లక్ష్యం

జమ్ముల రామకృష్ణారావు

ప్రపంచ ఆర్థిక రంగ నిర్మాణంలో బ్రిక్స్ దేశాల కార్మికులు కీలకపాత్ర పోషించారని అందువలన వివిధ దేశాల అభివృద్ధి ప్రపంచంలో గణనీయంగా పెరిగిందని వక్తలు దర్బన్‌లో జరిగిన సదస్సులో పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, ఎదుర్కొన్న సవాళ్ల మధ్య ఈ వృద్ధిని సాధించటం గుర్తించాలన్నారు. స్థిరమైన ఆర్థికవృద్ధిని సాధించటంలో బ్రిక్స్ దేశాలు పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. గత 30 సంవత్సరాలుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా సాంకేతిక రంగంలో ఈ మార్పులు ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. వేగవంతమైన సాంకేతిక అభివృద్ధి తరుణంలో శ్రామికశక్తిని సరైన నైపుణ్యంతో సన్నద్ధం చేయవలసిన ఆవశ్యకతను గుర్తించాలని వక్తలు సూచించారు. భవిష్యత్తు ఉద్యోగాలకోసం యువతను సిద్ధంచేసేందుకు విద్య, శిక్షణ కార్యక్రమాలకు పెట్టుబడులు పెట్టాలని సూచించారు. డిజిటల్ అక్షరాస్యత, సైన్స్, టెక్నాలజి, ఇంజినీరింగ్‌లు(స్టెమ్) విద్యను ప్రోత్సహించాలి. పరిశ్రమల అవసరాలకు సరిపోయే పాఠ్యాంశాలను సాంకేతికతకు అనుగుణంగా మార్పులు చేయాలని కోరారు. ఆటోమిషన్, కృత్రిమమేధస్సు వేగాన్ని పెంచాలని, ఈ మార్గంలోనే ట్రేడ్‌యూనియన్ సైతం ముందుకు నడవాలని అన్నారు.

వివిధ దేశాల్లో పెరుగుతున్న ఆర్థికవ్యవస్థకు అనుగుణంగా ఉద్యోగాలలో భాగస్వామ్యం కల్పించటం తగినంతగా లేదు. దీని నుండి బైటపడి కొత్త ఉద్యోగాలు కల్పించాలంటే చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే చర్యలు తీసుకోవటం అవసరం అని తెలిపారు. అందుకు అనుగుణంగా కొత్త మార్కెట్ల అన్వేషణ సాగాలి. దీనికి నూతన మార్గాలను ప్రభుత్వాలు ఆలోచించాలని వక్తలు కోరారు. ఆదాయ అసమానతలు గూర్చిన చర్చలో ఆర్థిక అభివృద్ధి కొద్దిమందికే చెందినదిగా కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు ఆదాయాన్ని సమకూర్చేదిశగా ఉండాలని చెప్పారు. దీనికితోడు వేతనాల పెరుగుదల, న్యాయబద్ధమైన కార్మిక సంక్షేమం, ఆదాయ పునర్విభజన వంటివి ఉండాలని, బ్రిక్స్‌దేశాలలో ఆదాయ అసమానతలు తగ్గించాలని అందుకు అందరూ కృషి చేయాలని సదస్సు నిర్ణయించింది. ఇందుకుగాను సమానపనికి

సమానవేతనం, సామాజిక భద్రత వంటి అంశాలలో ట్రేడ్ యూనియన్లు యాజమాన్యాలతో చర్చించాలన్నారు. నూతన అవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతును కూడగడుతూ స్టార్టప్‌లను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వాలపై వత్తిడి తేవాలని కోరింది.

ఇటీవల జరిగిన జి-20 శిఖరాగ్ర సమావేశం (దిల్లీ) పర్యావరణ సుస్థిరత, అభివృద్ధి ప్రాముఖ్యతను వివరించిందని, పర్యావరణం అంశం కార్మిక సమస్యలతో ముడిబడిఉందని, ఈ సమతుల్యతను భవిష్యత్తు తరాల అవసరంకోసం కాపాడటంలో కార్మిక సంఘాలు క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరింది. బ్రిక్స్ ట్రేడ్‌యూనియన్ల ఫోరం కాలుష్య రహిత ఉద్యోగాలను ప్రోత్సహించటానికి మార్గాలను అన్వేషించాలని కోరింది. హరిత సాంకేతికతను మనం అభివృద్ధి వ్యూహంగా మార్చుకోవాలని అదే అభివృద్ధికి బాటలు వేస్తుందని సదస్సు కోరింది. వివిధ రంగాలలో సరిహద్దు భాగస్వామ్యం నెలకొల్పేందుకు వాణిజ్యం, మౌలిక సదుపాయాల కల్పన, పరిశోధనలు వంటివి కలిసి నిర్వహించాలని ప్రభుత్వాలకు సదస్సు సూచించింది. సమకాలీన ప్రపంచ సమస్యలపై సంప్రదింపులు, సమన్వయం, సహకారం కోసం బ్రిక్స్ ఫోరంను ఉపయోగించుకోవాలని కోరారు.

బ్రిక్స్ దేశాల కార్మిక సదస్సులో ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యులు, విశాఖ స్టీల్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి జమ్ముల రామకృష్ణారావు భారతదేశం నుండి ఏకైక ప్రతినిధిగా పాల్గొన్నారు. సెప్టెంబరు 27వ తేదీన జరిగిన ముగింపు సమావేశంలో ఆయన భారత ట్రేడ్‌యూనియన్ల తరఫున ప్రసంగించడంతోపాటు సదస్సుకు ఒక పత్రం సమర్పించారు. ప్రస్తుతం భారతదేశంలో కార్మికవర్గం స్థితిగతులను ఆయన వివరించారు. భారత కార్మిక వర్గం మనోభావాలకు భిన్నంగా ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు అనుసరిస్తున్నదని, భారత్‌లో ప్రభుత్వరంగం సాధించిన విజయాలను గూర్చి వివరించారు. భారత కార్మిక వర్గం మనోభావాలకు భిన్నంగా ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు అనుసరిస్తున్నదని పేర్కొన్నారు. ప్రైవేటు పెట్టుబడిదారీ విధానంలో కార్మికులు ఎలా తమ బేరసారాల శక్తిని కోల్పోతున్నారో ఆయన వివరించారు.

పారిశ్రామిక రక్షణ, ఆరోగ్యం వంటి అంశాలలో భారత కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను రామకృష్ణ సదస్సులో వివరించారు. కార్మిక రంగంలో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా రామకృష్ణ స్పష్టం చేశారు. సమానపనికి సమానవేతనం అనే అంశంపై భారత ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని, చట్టాలను అమలు చేయటంలో చిత్తశుద్ధి లోపించిందని ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ వేదికలమీద ఆమోదించిన అంశాలను సైతం పాలకులు నిర్లక్ష్యం వహించటం సరికాదన్నారు. పని పరిస్థితులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని ఆయనచెప్పారు. భారతదేశంలో 12గంటల పనివిధానం ప్రవేశపెట్టాలని చూస్తున్నారని, ఇది అంతర్జాతీయ కార్మిక చట్టాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. దేశంలో 44 కార్మిక చట్టాల స్థానంలో 4 లేబరు కోడ్‌లను తీసుకు వచ్చారని, ఇవి కార్మికులను యజమానులకు బానిసలుగా చేసేవిధంగా ఉన్నాయన్నారు. బ్రిటీష్ కాలంలోనే భారత కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కోల్పోవటం బాధాకరమైనదని చెప్పారు. బ్రిక్స్ కార్మిక సదస్సులో భారతదేశ ప్రతినిధిగా పాల్గొని తిరిగి స్వదేశానికి విచ్చేసిన రామకృష్ణను పలువురు అభినందించారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాల ఆర్థిక కూటమి 'బ్రిక్స్' ట్రేడ్ యూనియన్‌ఫోరం సమావేశాలు గత నెల సెప్టెంబరు 26,27 తేదీలలో దర్బన్‌సిటీ (దక్షిణాఫ్రికా)లో జరిగాయి.

విశాఖ స్టీల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)
అదనపు ప్రధానకార్యదర్శి

సిక్కింలో వరద బీభత్సం

- ఐదుగురి మృతి... 23 మంది సైనికుల గల్లంతు
- కొట్టుకుపోయిన ఇళ్లు... ఇతర సముదాయాలు
- సహాయక శిబిరాలకు బాధిత ప్రజల తరలింపు

గ్యాంగ్‌టక్: సిక్కింలో వరద బీభత్సం సృష్టించడంతో 5 మంది మృతి, 23 మంది సైనికులు గల్లంతయ్యారు. ఉత్తర సిక్కింలోని లొనాక్ సరస్సుపై మేఘాలు విస్ఫోటనం చెందడంతో తీస్తా నది పరీవాహక ప్రాంతంలో ఆకస్మిక వరదలు రావడంతో బుధవారం ఐదుగురు మరణించగా, 23 మంది సైనిక సిబ్బంది గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. తెల్లవారుజామున సుమారు 1.30 గంటలకు వరద ప్రారంభమవడంతో చుంగ్‌తంగ్ డ్యామ్ నుంచి నీటిని విడుదల చేశారు. దీంతో పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని వారు వివరించారు. 'గోలిటార్, సింగతం ప్రాంతంలో ఐదు మృతదేహాలను స్వాధీనం చేసుకోగా, గోలిటార్ నుంచి ముగ్గురిని రక్షించారు' అని గ్యాంగ్‌టక్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డీఎం) మహేంద్ర చెత్రీ తెలిపారు. 'రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌కు 30 కిలోమీటర్ల దూరంలో ఇంద్రేణి వంతెనగా పిలువబడే సింగతం వద్ద ఉన్న స్టీల్ వంతెన బుధవారం తెల్లవారుజామున తీస్తా నది నీటిలో పూర్తిగా కొట్టుకుపోయింది' అని మరొక అధికారి తెలిపారు. సిక్కిం ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌లో ప్రకృతి వైపరీత్యాన్ని విపత్తుగా ప్రకటించింది. చుంగ్‌తంగ్ డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయడం వల్ల దిగువకు 15 నుంచి 20 అడుగుల ఎత్తు వరకు నీటి మట్టాలు అకస్మాత్తుగా పెరిగాయని రక్షణ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర రావత్ తెలిపారు. '23 మంది సైనిక సిబ్బంది తప్పిపోయినట్లు నివేదించగా, 41 వాహనాలు బురదలో మునిగిపోయాయి' అని ఆయన వివరించారు. తీస్తా బేసిన్‌లో దిక్చు, సింగతం, రంగ్‌పో సహా అనేక పట్టణాలు కూడా నది ఉప్పెనతో ముంపునకు గురయ్యాయి. ఇదిలాఉండగా, మంగన్, గ్యాంగ్‌టక్, పాక్యోంగ్, నామ్చి జిల్లాల్లోని అన్ని పాఠశాలలను అక్టోబరు 8 వరకు మూసివేస్తున్నట్లు విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సిక్కిం, దేశంలోని ఇతర ప్రాంతాల మధ్య ప్రధాన అనుసంధానంగా ఉన్న జాతీయ రహదారి-10 భాగాలు కొట్టుకుపోయాయని, తీస్తా ప్రవహించే ఉత్తర బెంగాల్, బంగ్లాదేశ్‌కు వరద హెచ్చరిక జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి నుంచి తీస్తా వరద ఉధృతి కారణంగా ల్యాంకో హైడల్ పవర్ ప్రాజెక్టు సమీపంలోని మరో రెండు వంతెనలు బలుతార్, మరొకటి కూలిపోయాయని వారు తెలిపారు. వరద బీభత్సం నేపథ్యంలో పాలనా యంత్రాంగం అనేక సహాయ శిబిరాలను ఏర్పాటు చేసింది. వందల మంది ఆశ్రయం పొందుతున్నారని అధికారులు తెలిపారు. సిక్కిం రాష్ట్ర విపత్తు నిర్వహణ మండలి ప్రకారం, ల్హోనాక్ సరస్సు కొన్ని భాగాలలో మేఘ విస్ఫోటనం కారణంగా బుధవారం తెల్లవారుజామున తీస్తా నదీ పరీవాహక ప్రాంతం వెంబడి దిగువన చాలా ఎక్కువ వేగంతో నీటి మట్టాలు పెరగడంతో మంగన్, గ్యాంగ్‌టక్, పాక్యోంగ్, నామ్చిలోని అనేక నివాసాలు కొట్టుకుపోయాయి' అని వివరించారు. ముఖ్యమంత్రి పీఎస్ తమాంగ్ సింగతంను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. సింగతం నగర పంచాయతీ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి అప్రమత్తంగా ఉండాలని కోరారు. తమంగ్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌లో, ఈ సవాలు సమయాల్లో, ఈ దురదృష్టకర సంఘటన వల్ల ప్రభావితమైన బాధితులందరికీ, వారి కుటుంబాలకు నా హృదయపూర్వక మద్దతును అందించాలనుకుంటున్నాను' అని పేర్కొన్నారు. 'ఆపదలో ఉన్నవారికి అవసరమైన అన్ని సహాయాలు అందించడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని నేను మీకు హామీ ఇస్తున్నాను. మేము పరిస్థితిని అర్థం చేసుకున్నాము. మా పౌరుల భద్రతను నిర్ధారించడానికి అందుబాటులో ఉన్న అన్ని వనరులను సమీకరిస్తున్నాము. ఈ విపత్తు వల్ల ఎదురయ్యే తక్షణ ఆందోళనలు, సవాళ్లను పరిష్కరించడానికి మా అంకితభావంతో కూడిన బృందాలు పగలు, రాత్రి పని చేస్తున్నాయి' అని తమంగ్ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో గత కొన్ని రోజులుగా కుండపోత వర్షాల కారణంగా తీస్తా నదిలో నీటి మట్టం పెరగడంతో పాటు కాలింపాంగ్, డార్జిలింగ్, అలీపుర్‌దువార్ జల్పాయ్‌గురి జిల్లాల్లోని అనేక ప్రాంతాలను ప్రభావితం చేసింది. ఇక్కడ పరిపాలన యంత్రాంగం బాధిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం ప్రారంభించిందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు.

భూ కుంభకోణం కేసులో లాలూకు బెయిల్

న్యూఢిల్లీ: భూ కుంభకోణం కేసులో రాష్ట్రీయ జనతా దళ్ పార్టీ అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఢిల్లీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసులో ఆయన సతీమణి రాబ్డీదేవి, ఆయన కుమారుడు, బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, కుమార్తె, ఆర్జేడీ ఎంపీ మీసా భారతీలకు కూడా బెయిల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లాలూ కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో రైల్వేలో ఉద్యోగాలు ఇప్పించేందుకు కొందరు అభ్యర్థుల నుంచి భూములు తీసుకున్నారన్న అభియోగాలపై ఆయనతోపాటు మరో 15 మందిపై గతేడాది మే 18న సీబీఐ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. అదే ఏడాది అక్టోబరులో తొలి చార్జిషీట్ దాఖలు చేయగా, ఈ ఏడాది జులై 3న మరో చార్జ్‌షీట్ సమర్పించింది. ఈ ఏడాది సెప్టెంబరు 22న ఈ కేసులో విచారణకు హాజరుకావాలని నిందితులకు సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో లాలూ ప్రసాద్ ఢిల్లీలో రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. లాలూ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ గీతాంజలి గోయల్ బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2004 నుంచి 2009 వరకు కేంద్రంలో యూపీఏ హయాంలో లాలూ రైల్వేమంత్రిగా ఉన్నారు. 2008-09 మధ్య రైల్వే ఉద్యోగాలకు నియామక ప్రక్రియ జరగగా... అందులో కొన్ని అవకతవకలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. కొందరు అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు వారి నుంచి లాలూ కుటుంబం భూములు, ఇతర ఆస్తులు లంచంగా తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో సీబీఐ కేసు నమోదు చేసింది. దాణా కుంభకోణం కేసులో లాలూ జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన కొద్ది వారాలకే ఈ కేసు నమోదైంది.

మణిపూర్‌ను వదిలేసి రాజకీయాలు చేస్తారా?

ప్రధాని మౌనంపై కాంగ్రెస్ మండిపాటు

న్యూఢిల్లీ: మణిపూర్ సంక్షోభంపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనంగా ఉండటాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పు బట్టింది. మణిపూర్ హింసపై ప్రధాని మోదీ స్పందించకుండా వివిధ రాష్ట్రాల్లో తిరుగుతూ రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం వచ్చిన 15 నెలలకే రాష్ట్రంలో విధ్వంసం జరుగుతోందని ఆక్షేపించారు. రాష్ట్రాన్ని, అక్కడి ప్రజలను ప్రధాని పూర్తిగా విడిచిపెట్టారని అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ విభజన రాజకీయాల వల్లే రాష్ట్రంలో ఈ పరిస్థితి ఏర్పడిందని జైరాం విమర్శించారు. ప్రధాని ఈ అంశంపై లోక్ సభలో మాట్లాడటానికి కేవలం 5 నిమిషాల సమయం తీసుకోవడం దారుణమని వ్యాఖ్యానించారు. మణిపూర్ హింసకు సంబంధించి వివిధ అంశాలపై స్పందించాలని డిమాండ్ చేస్తూ ఆయన కాంగ్రెస్ పార్టీ తరపున ప్రశ్నలు సంధించారు.

మణిపూర్ సీఎం బీరెన్ సింగ్ తో ప్రధాని మోదీ చివరిసారి ఎప్పుడు మాట్లాడారు? మణిపూర్ బీజేపీ ఎమ్మెల్యేలను ఆయన చివరిసారి ఎప్పుడు కలిశారు? రాష్ట్రానికి చెందిన తన మంత్రివర్గ సహచరుడితో రాష్ట్రంలో పరిస్థితి గురించి ప్రధాని చివరిసారి ఎప్పుడు చర్చించారు? హింసాత్మక ఘటనల్లో బాధిత కుటుంబాలకు బీజేపీ సర్కార్ చేసిన సాయమేంటి? అంటూ జైరాం రమేశ్ ప్రధానిని ప్రశ్నించారు. మణిపుర్ లో కుకీ, మైతేయి తెగల మధ్య చెలరేగిన ఘర్షణలో 175 మంది మరణించారు. 50 వేలకు పైగా నిరాశ్రయులయ్యారు. అదే సమయంలో మహిళలపై లైంగిక వేధింపు ఘటనల వీడియోలు బయటకి వచ్చాయి. ఈ వీడియోలు యావత్తు దేశాన్నే కదిలించాయి. సుప్రీంకోర్టు సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

బీసీల సంక్షేమానికే కులగణన: ఖర్గే

కొడటర్రై (చత్తీస్‌గఢ్): వెనుకబడి వర్గాల కచ్చితమైన సమాచారం లభిస్తే తదనుగుణంగా వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవచ్చనే కులగణన కోసం తమ పార్టీ డిమాండ్ చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్ జిల్లా, కొడటర్రై గ్రామంలో ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన 'భరోసే కా సమ్మేళన్'లో ఖర్గే మాట్లాడుతూ 'కులగణన జరిగితే ఎంతమంది బీసీలు ఉన్నారు. వారిలో అక్షరాస్యులు ఎంత మంది, ఆర్థికంగా వెనుకబడిన వారెందరు వంటి వివరాలన్నీ వెల్లడవుతాయి. దీంతో వారి అభ్యున్నతికి, సంక్షేమ చర్యలను తీసుకోవచ్చు' అని చెప్పారు. కుల గణన పేరిట దేశాన్ని విభజించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ప్రధాని మోదీ ఆరోపణలు చేస్తున్నారని ఖర్గే దుయ్యబట్టారు.మహిళల హక్కులను హరించేందుకు యత్నిస్తోందన్నారు. ప్రజలకు ఎవరేమిటో అర్థమైందని, మోదీ ఆటలు ఎక్కువ కాలం సాగబోవని ఖర్గే వ్యాఖ్యానించారు. మోదీని 'అబద్ధాలు చెప్పేవారికి సర్దార్'గా వర్ణించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ది మహిళా వ్యతిరేక సిద్ధాంతమని ఖర్గే విమర్శించారు. ప్రజలు వేధించడానికి కాషాయ పార్టీ హామీనిస్తుందని, ఉపాధి కల్పనకు, రైతులకు మద్దతు ధర పెంచేందుకు కాంగ్రెస్ హామీనిస్తుందని ఆయనన్నారు. వెనుకబడి వర్గాలు, పేదలు, మహిళల విషయంలో కాషాయ పార్టీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రస్తుత పార్లమెంటు సంఖ్యాబలంలోనే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. 'మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించిందని వారు(బీజేపీ) అన్నారు. పంచాయతీల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగంలో సవరణలు తెచ్చింది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. జనసంఘ్, బీజేపీ లేక ఆర్‌ఎస్‌ఎస్ పేరు ఏదైనాగానీ వాటిది మహిళా వ్యతిరేకత సిద్ధాంతమని, మహిళల పురోగతిని జీర్ణించుకోలేవని ఖర్గే వ్యాఖ్యానించారు.

రణ్‌బీర్ కపూర్‌కు ఈడీ సమన్లు



న్యూఢిల్లీ: బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేసింది. ఓ ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌నకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈ నెల 6న విచారణకు హాజరు కావాలని ఈడీ పేర్కొంది. ఇటీవల మహదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో ఈడీ చేపట్టిన దర్యాప్తులో అనేకమంది బాలీవుడ్ సెలబ్రిటీల పేర్లు వినిపించడం కలకలం రేపింది. బెట్టింగ్ యాప్ మాటున జరుగుతున్న ఓ భారీ కుంభకోణాన్ని ఇటీవల ఈడీ బట్టబయలు చేసింది. చత్తీస్‌గఢ్‌కు చెందిన సౌరభ్ చంద్రఖర్, రవి ఉప్పల్ దుబాయ్ కేంద్రంగా దేశంలో మహదేవ్ బెట్టింగ్ యాప్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అయితే, వీరు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ముసుగులో మనీలాండరింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఈడీ గుర్తించింది. బెట్టింగ్ యాప్ ద్వారా వచ్చే మొత్తాన్ని ఆఫ్‌షోర్ ఖాతాలకు తరలించేందుకు హవాలా మార్గాన్ని అనుసరిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. కొత్త యూజర్లను ఆకట్టుకోవడానికి ఈ బెట్టింగ్ యాప్ పెద్దఎత్తున ప్రకటనల కోసం ఖర్చు చేసినట్లు ఈడీ పేర్కొంది. ఈ క్రమంలోనే ఇటీవల కోల్‌కతా, భోపాల్, ముంబై తదితర నగరాల్లో సోదాలు నిర్వహించి... మొత్తం రూ.417 కోట్ల ఆస్తులు సీజ్ చేసింది. ఈ కేసులో చాలామంది బాలీవుడ్ సెలబ్రిటీల పేర్లు కూడా వినిపించాయి. మహాదేవ్ బెట్టింగ్ యాప్ నిర్వాహకుల్లో ఒకరి పెళ్లికి వీరు హాజరవ్వడమే దీనికి కారణం. ఈ యాప్ ప్రమోటర్లలో ఒకరైన సౌరభ్ చంద్రఖర్ వివాహం ఈ ఏడాది ఫిబ్రవరిలో యూఏఈలో జరిగింది. ఇందుకోసం రూ.200 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిసింది. ఈ వివాహ వేడుకకు బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్, సన్నీ లియోనీ, నేహా కక్కర్, అతిఫ్ అస్లమ్, రహత్ ఫతేహ్ అలీ ఖాన్, అలీ అస్గర్, విశాల్ దద్లానీ తదితరులు హాజరయ్యారు. వీరి కోసం ఓ ప్రైవేటు జెట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీంతో ఆ వేడుకకు హాజరైన సినీతారలపై ఈడీ దృష్టి సారించింది. అందులో భాగంగానే రణ్‌బీర్ కపూర్‌కు సమన్లు జారీ చేసింది.మరో 17 మంది బాలీవుడ్ సెలబ్రిటీలపై ఈడీ నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. త్వరలోనే వారికీ సమన్లు జారీ అయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ఆస్పత్రి డీన్‌తో టాయిలెట్లు కడిగిస్తారా

ఐఎంఏ ఆగ్రహం

థానె: మహారాష్ట్రలోని నాందేడ్ ప్రభుత్వ ఆస్పత్రి డీన్‌తో శివసేన ఎంపీ హేమంత్ పాటిల్ మరుగుదొడ్లు శుభ్రం చేయించిన ఘటనను వైద్యుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ వ్యవహారంపై మహారాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించింది. ఆస్పత్రి తాత్కాలిక డీన్ పట్ల ప్రజాప్రతినిధులు వ్యవహరించిన తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం ఏక్‌నాథ్ షిండేకు వినతిపత్రం సమర్పించినట్టు మహారాష్ట్ర భారతీయ వైద్య సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. నాందేడ్ ఆస్పత్రిలో మరణాలపై సరైన విచారణ జరపాలని తాము కోరుతున్నట్టు చెప్పారు. అయితే, వైద్య కళాశాల డీన్‌తో మరుగుదొడ్లు కడిగించడం ద్వారా ఓ ఎంపీ వ్యవహరించిన తీరు సమర్థనీయం కాదని పేర్కొన్నారు. రోగుల రద్దీని పరిగణనలోకి తీసుకుంటే ఆస్పత్రిలో సిబ్బంది సంఖ్య సరిపోదని పేర్కొంది. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఐఎంఏ-మహారాష్ట్ర హెచ్చరించింది.

ఎంపీపై డీన్ ఫిర్యాదు

ఒక ప్రభుత్వ ఉద్యోగిని తన విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం, తన పరువుకు నష్టం కలిగించారన్న ఆరోపణలపై ఎంపీ హేమంత్ పాటిల్‌పై డీన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. మహారాష్ట్రలోని నాందేడ్ ప్రభుత్వ ఆస్పత్రిలో 48 గంటల వ్యవధిలో 31 మరణాలు సంభవించిన ఘటన సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. మంగళవారం ఆస్పత్రిని సందర్శించిన ఎంపీ హేమంత్ పాటిల్ మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నట్టు గుర్తించారు. ఆస్పత్రి డీన్ శ్యాం రావ్ వాకోడేను అక్కడికి పిలిపించి మరుగుదొడ్ల అపరిశుభ్రతపై గట్టిగా నిలదీశారు. అంతటితో ఆగకుండా డీన్‌తోనే మరుగుదొడ్లు శుభ్రం చేయించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

ప్రభుత్వ పటిష్టతకే అజిత్ వర్గంతో చెలిమి

ఫడ్నవిస్ వెల్లడి

ముంబై: బీజేపీతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని మరింత పటిష్టం చేయాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అజిత్ పవార్ వర్గం కోరుకున్నదని. అందుకే ఆ వర్గాన్ని కలుపుకున్నామని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవిస్ ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఏక్‌నాథ్ షిండే వర్గం చేరిక సమయంలోనూ ఇదే జరిగిందని చెప్పుకొచ్చారు. 'ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా విపక్ష పార్టీలు చేతులు కలిపాయి. అదేవిధంగా మాతో కలిసి మాకు మరింత బలం చేకూర్చేందుకు ముందుకు వచ్చే ఏ పార్టీనైనా కలుపుకుపోతాం' అని ఫడ్నవిస్ చెప్పారు. ఎన్‌సీపీలో గత జులైలో చీలిక తీసుకువచ్చిన అజిత్ పవార్...తనవర్గం ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీతో పొత్తు పెట్టుకుని ప్రభుత్వంలో చేరారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గాన్ని రాజకీయ భాగస్వామిగా ఫడ్నవిస్ తన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. శివసేన (షిండే వర్గం) తమ సహజ భాగస్వామి అని, ఎన్‌సీపీ రాజకీయ భాగస్వామి అని చెప్పారు. ఇంకా సహజ భాగస్వామి కాలేదన్నారు. రాబోయే ఐదు, పదేళ్లు తమతో ఉంటే అజిత్‌వర్గం కూడా సహజ భాగస్వాములవుతారని విశ్లేషించారు. ఆ వర్గం తమతోనే ఉంటుందని బలంగా నమ్ముతున్నానని తెలిపారు. 27 భాగస్వామ్య పార్టీలు 'ఇండియా' కూటమిగా ఏర్పడటంపై ప్రశ్నించగా గతంలో వారంతా ఒకరితో ఒకరు కలబడిన వాళ్లేనని, పరస్పర అవసరాల రీత్యానే వారు ఇప్పుడు చేతులు కలిపారని ఫడ్నవిస్ అన్నారు.

ఒడిశాలో ఓబీసీ కులగణన

భువనేశ్వర్: బీహార్ తరహాలో ఒడిశా కూడా రాష్ట్రంలో కులగణన చేపట్టింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలో ప్రభుత్వం ఇతర వెనుకబడిన తరగతుల కోసం ఈ సర్వే నిర్వహిస్తోంది. త్వరలో నివేదికను విడుదల చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు అధికార పార్టీ తెలిపింది. ఓబీసీ గణనపై ఎంతో క్రియాశీలకంగా సర్వే కొనసాగుతోందని బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే ప్రసాద్ మిశ్రా మీడియాకు తెలియజేశారు. సర్వే అనంతరం కమిటీ నివేదికను సీఎంకు అందించనుందని ఆయన వివరించారు. ఈ సర్వే ఫలితాలు ఆరోగ్య సంరక్షణ, విద్య, ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత వంటి అంశాల అభివృద్ధికి తోడ్పడుతుందని ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు అసోం ప్రభుత్వం కూడా తమ రాష్ట్రంలో ఐదు స్థానిక ముస్లిం వర్గాలకు సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహిస్తోంది. సర్వే ఫలితాల అనంతరం వారి అభివృద్ధికి చర్యలు తీసుకోనుంది. ఇటీవల బీహార్ ప్రభుత్వం కులగణన నిర్వహించింది.

ఆస్పత్రుల్లో మృత్యు కేక

నాగపూర్ ప్రభుత్వాస్పత్రిలో 14 మంది మృతి

మహారాష్ట్రలో కొనసాగుతున్న విషాదం

నాగపూర్ : మహారాష్ట్ర ఆస్పత్రుల్లో వరుస మరణాలు ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నాయి. నాగ్‌పూర్‌లోని ఒక ప్రభుత్వాస్పత్రిలో 24 గంటల్లో 14 మంది రోగులు మరణించారు. నగరంలోని మరో ప్రభుత్వ వైద్య సదుపాయంలో అదే సమయంలో తొమ్మిది మరణాలు నమోదయ్యాయని అధికారులు బుధవారం తెలిపారు. సెప్టెంబరు 30, అక్టోబరు 2 మధ్య నాందేడ్‌లోని డాక్టర్ శంకర్‌రావ్ చవాన్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో 48 గంటల్లో 31 మంది రోగులు మరణించిన నేపథ్యంలో ఈ ఆస్పత్రుల అధికారులు ఈ గణాంకాలను వెల్లడించారు. 24 గంటల వ్యవధిలో ఛత్రపతి సంభాజీనగర్‌లోని ప్రభుత్వాస్పత్రిలో 18 మరణాలు నమోదయిన విషయం తెలిసిందే. నాగపూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి (జీఎంసీహెచ్) లో బుధవారం ఉదయం 8 గంటలతో ముగిసిన 24 గంటల్లో 14 మంది మరణించినట్లు ఆస్పత్రి అధికారి ఒకరు తెలిపారు. జీఎంసీహెచ్ డీన్ డాక్టర్ రాజ్ గజ్భియే మాట్లాడుతూ ఆస్పత్రిలో 1,900 పడకల సామర్థ్యం ఉందని, రోజూ సగటున 10 నుంచి 12 మంది రోగులు మరణిస్తున్నారని తెలిపారు. 'ఆస్పత్రిలో మరణించే రోగులు ఎక్కువగా చివరి నిమిషంలో రిఫరల్స్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) అడ్మిషన్ అవసరమయ్యే వారు. అటువంటి రోగులను ప్రాణాపాయ స్థితిలో జీఎంసీహెచ్‌కు తీసుకువస్తారని అన్నారు. మధ్య భారతదేశం అంతటా రోగులు ఆస్పత్రిలో చేరుతున్నారని ఆయన తెలిపారు. అదేవిధంగా, నగరంలోని ఇందిరా గాంధీ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి (ఐజీజీఎంసీహెచ్) లో 24 గంటల్లో తొమ్మిది మరణాలను నివేదించినట్లు ఆస్పత్రి ఉన్నతాధికారి చెప్పారు.

'చనిపోయిన రోగులలో చాలా మందిని క్లిష్ట పరిస్థితిలో అక్కడికి తీసుకువచ్చారు. వీరిలో వెంటిలేటర్ సపోర్ట్ అవసరమయ్యే రోగులు ఉన్నారు' అని ఆయన పీటీఐకి వివరించారు. విదర్భ ప్రాంతం అంతటా ఉన్న రోగులు ఆస్పత్రిలో చేరారు. ఐజీజీఎంసీహెచ్ 800 పడకల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది ప్రతిరోజూ సగటున ఆరుగురు రోగుల మరణాన్ని నివేదిస్తున్నట్లు అధికారి తెలిపారు. 'ఆస్పత్రిలో మందులు, ఇతర సౌకర్యాల తగినంత నిల్వ ఉంది' అని అధికారి వివరించారు.

బిడ్డను కోల్పోయా... భార్య ఆరోగ్యం దెబ్బతింది

వైద్యుల నిర్లక్ష్యమే కారణం

నాందేడ్ ప్రభుత్వాస్పత్రిలో మరణాలపై బాధితుడి ఆవేదన

ఛత్రపతి శంభాజీనగర్ : మహారాష్ట్రలోని నాందేడ్ ప్రభుత్వాస్పత్రిలో రోగులు వరుస మరణాలపై బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వైద్యుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని వారు ఆరోపిస్తున్నారు. నాందేడ్‌లోని ప్రభుత్వాస్పత్రిలో 48 గంటల్లో మరణించిన 31 మంది రోగులలో నవజాత శిశువు కలిగి ఉన్న వ్యక్తి, తన బిడ్డ మరణానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. దిక్కుతోచని వ్యక్తి, నగేష్ సోలంకే... పుట్టిన తర్వాత తన బిడ్డ బరువు తక్కువగా లేదని పేర్కొన్నాడు. అతని భార్యకు ప్రైవేట్ ఆస్పత్రిలో సి-సెక్షన్ ప్రక్రియ జరిగింది. అక్కడ బిడ్డను ప్రసవించారని, ఆ తర్వాత బిడ్డను చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. సెంట్రల్ మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని డాక్టర్ శంకర్‌రావ్ చవాన్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో సెప్టెంబరు 30 నుంచి 48 గంటల్లో శిశువులతో సహా 31 మరణాలు నమోదయ్యాయి. సెప్టెంబరు 30-అక్టోబరు 1 మధ్య ఆస్పత్రిలో జన్మించిన 12 మంది శిశువులతో సహా 24 మరణాలలో సోలంకే బిడ్డ కూడా ఉంది. అధికారుల ప్రకారం, అక్టోబరు 1-2 మధ్య అదే ఆస్పత్రిలో మరో ఏడు మరణాలు సంభవించాయి. 'నా బిడ్డ బరువు తక్కువగా లేదు. పూర్తిగా క్షేమంగా ఉంది. ఇప్పుడు లేని నా బిడ్డకు ఏమైందో తెలియదు. నేను నా బిడ్డను కోల్పోయాను. నా భార్య సిజేరియన్ ఆపరేషన్ కారణంగా ఆమె ఆరోగ్యం శాశ్వతంగా దెబ్బతింది. నేను సర్వస్వం కోల్పోయాను' అని సోలంకే ఆస్పత్రి వెలుపల విలేకరులతో అన్నారు. నాందేడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మహిళకు సిజేరియన్ చేయడంతో భార్యాభర్తలు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. 'ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యులు పాప బాగానే ఉందని, అయితే నాలుగైదు రోజులు గ్లాసులో (వెచ్చగా) ఉంచాలని చెప్పారు. నేను ఇప్పటికే (భార్య) శస్త్ర చికిత్స కోసం డబ్బు ఖర్చు చేశాను. తదుపరి చికిత్స కోసం ఈ భారీ మొత్తాన్ని భరించలేకపోయాను. శిశువు అయినందున మేము నాందేడ్‌లోని ప్రభుత్వాస్పత్రికి వచ్చాము' అని సోలంకే చెప్పారు. సెప్టెంబరు 30వ తేదీ సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పాపను ఆస్పత్రిలో చేర్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం బయట ఉన్న మందుల దుకాణం నుంచి మందులు తెచ్చి వైద్యులకు అందజేశారు. సోలంకే ప్రకారం, అక్టోబరు 1 తెల్లవారుజామున 2 గంటల వరకు అతని బిడ్డ బాగానే ఉంది. 'తర్వాత, తెల్లవారుజామున 4 గంటలకు వారు శిశువును ఏదో పెద్ద మెషిన్‌లో ఉంచుతున్నారని వైద్యులు చెప్పారు. వారు దాని పేరు నాకు చెప్పలేదు' అని వివరించాడు. 'మేము బయట వేచి ఉన్నాము. వారు మా సంతకాలు అడిగారు. అప్పుడు కేవలం 10-15 నిమిషాల్లో నా బిడ్డ చనిపోయింది. నా బిడ్డతో పాటు మరో ఇద్దరు పిల్లలు, ఇద్దరు కవలలు కూడా మరణించారు. వారు మమ్మల్ని లోపలికి పిలిచి మరణాలను ప్రకటించారు' అని తెలిపాడు. 12 మంది పిల్లలు (ఆస్పత్రిలో ఒక రోజులో) ఎలా చనిపోతారు? అని సోలంకే ప్రశ్నించారు. 'యంత్రాలు పని చేయకపోతే, వైద్యులు నిర్లక్ష్యంగా ఉంటే మాత్రమే ఇది సాధ్యమవుతుంది. డీన్ కూడా సౌకర్యంపై శ్రద్ధ చూపడం లేదు' అని ఆయన అన్నారు. అతను ఉద్వేగానికి లోనవుతూ, బిడ్డ కోసం తొమ్మిది నెలలు వేచి ఉన్న తాను ఇప్పుడు ప్రతిదీ కోల్పోయానని చెప్పాడు. 'నేను నా బిడ్డను, నా డబ్బును పోగొట్టుకున్నాను. వైద్యులు (ప్రైవేట్ ఆస్పత్రిలో) డబ్బు అడిగారు. పాప చికిత్స కోసం మేము ఇక్కడకు వచ్చాము. ఇది వైద్యుల నిర్లక్ష్యం కారణంగా జరిగింది. సౌకర్యాల కొరత ఉంది. వారు చేయలేదు. లోపలికి వెళ్లి మా బిడ్డను చూడటానికి కూడా నన్ను అనుమతించండి. నేను ఒక్కసారి హాస్పిటల్ డీన్‌ని కలవాలనుకుంటున్నాను' అని సోలంకే ఆవేదన వ్యక్తం చేశాడు.

మహారాష్ట్ర వైద్య విద్య మంత్రి హసన్ ముష్రిఫ్ మంగళవారం మాట్లాడుతూ నాందేడ్‌లోని ప్రభుత్వాస్పత్రిలో పెద్ద సంఖ్యలో రోగుల మరణానికి కారణాన్ని నిర్ధారించడానికి విచారణ జరుపుతామని, రాబోయే 15 రోజుల్లో ఆస్పత్రిలోని పరిస్థితులు మెరుగుపడతాయని హామీ ఇచ్చారు. ఆస్పత్రిలో మందుల కొరత లేదని, ఎవరైనా నిర్లక్ష్యం వల్ల మరణాలు సంభవించినట్లయితే, ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని మంత్రి ముష్రిఫ్ అన్నారు. కాగా, ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మాట్లాడుతూ నాందేడ్ ఆస్పత్రిలో జరిగిన మరణాలను తమ ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని, మందులు, సిబ్బంది కొరత ఉందని నిరాకరిస్తూ సమగ్ర విచారణ తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఒప్పందాలు కార్యరూపం

- పరిశ్రమలు, ఆహారశుద్ధి రంగంలో 13 ప్రాజెక్టులు
- రూ.3 వేల కోట్ల పెట్టుబడులు, 7వేల మందికి ఉద్యోగావకాశాలు
- వర్చువల్‌గా సీఎం జగన్ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో‌- అమరావతి: పరిశ్రమలు, ఆహారశుద్ధి రంగంలో మొత్తం 13 ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. వీటిలో పూర్తయిన మూడు కంపెనీలను ప్రారంభించగా, 9 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఒక ప్రాజెక్టుకు అవగాహన ఒప్పందం చేసుకున్నారు. వీటిలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా 91 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుండగా, ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా రూ.2294 కోట్ల పెట్టుబడులు, 4300 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో మరో ఆరు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయగా, వీటిద్వారా రూ.714 కోట్ల పెట్టుబడి, 3,155 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. వీటిలో తిరుపతి జిల్లా నాయుడుపేట ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో 66.49 ఎకరాల్లో ఏర్పాటైన గ్రీన్‌లామ్ సౌత్ లిమిటెడ్ ద్వారా రూ.800 కోట్ల పెట్టుబడులు, అనంతపురం జిల్లా డి.హీరేలాల్ మండలం జాజరకల్లులో బయో ఇథనాల్ తయారీ యూనిట్ ద్వారా రూ.544 కోట్ల పెట్టుబడులు, శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర వద్ద రూ.250 కోట్లతో ఎవరెస్ట్ స్టీల్ బిల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు, బాపట్ల జిల్లా కొరిసపాడు మండలం బుద్ధవానిపాలెంలో రూ.225 కోట్లతో శ్రావణి బయో ఫ్యూయల్ యూనిట్ ఏర్పాటు, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం నరువ గ్రామంలో 57 ఎకరాల్లో రూ.200 కోట్లతో నాగార్జున ఆగ్రో కెమికల్స్ కంపెనీ ఏర్పాటు, తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో రూ.150 కోట్లతో రవళి స్పిన్నర్స్ యూనిట్, సత్యసాయి జిల్లా గుడిపల్లెలో రూ.125 కోట్లతో యునైటెడ్ ఇండస్ట్రీస్ ఆటోమోటివ్ ప్లాస్టిక్స్ యూనిట్, తిరుపతి జిల్లా వరదాయిపాలెం మండలం కంచర్లపాలెంలో రూ.325 కోట్లతో డీపీ చాకోలేట్స్, కోకో బట్టర్ కంపెనీలు న్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో భాగంగా విశాఖపట్నంలో ఆ రోజు పరిశ్రమలు నెలకొల్పేందుకు... దాదాపు 386 ఎంఓయూలు, రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు, దానిద్వారా 6 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. అవన్నీ సాకారం కావాలని... ప్రతి నెలా వాటిని కార్యరూపం దాల్చేలా... అవి అమలు కావాలన్న ఉద్దేశంతో సీఎస్ అధ్వర్యంలో ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటు చేసి..పారిశ్రామిక వేత్తలను చేయిపట్టుకుని నడిపించే కార్యక్రమం చేస్తున్నాం. అందులో భాగంగా ఈరోజు ఇటువంటి పరిశ్రమలకు సంబంధించిన 13 శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. 14 జిల్లాల్లో వస్తున్న ఈ పరిశ్రమల వల్ల సుమారు 7వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. 75 శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని మనం చట్టం చేశాం. దీనివల్ల మన పిల్లలందరికీ మంచి జరుగుతుందన్నారు. పారిశ్రామికవేత్తల పట్ల అత్యంత సానుకూలంగా ఉన్నామని, ప్రభుత్వపరంగా ఎటువంటి సహకారమైనా అందించడానికి అధికారయంత్రాంగం సిద్ధంగా ఉంటుందని సీఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, పరిశ్రమలు, వాణిజ్య, మౌలికసదుపాయాలు, పెట్టుబడులు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, మార్కెటింగ్, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి, పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ ప్రవీణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థ జోక్యం తప్పదు

- పత్రికా స్వేచ్ఛపై దాడుల నివారణకు సహకరించండి
- సీజేఐ చంద్రచూడ్‌కు జర్నలిస్టు సంఘాల లేఖ

న్యూదిల్లీ: దేశంలో పత్రికా స్వేచ్ఛపై, జర్నలిస్టులపై తరచూ జరుగుతున్న దాడుల కట్టడికి న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవా ల్సిందేనని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్‌ని జర్నలిస్టు సంఘాలు కోరాయి. తమకు జరుగుతున్న అన్యాయాన్ని సీజేఐ దృష్టికి తీసుకెళుతూ 16 జర్నలిస్టు సంఘాలు, మీడియా సంస్థలు ఉమ్మడి లేఖ రాశాయి. న్యూస్ క్లిక్ వార్తాసంస్థపై దిల్లీ పోలీసు దాడులు, 46 మంది జర్నలిస్టులు, ఎడిటర్లు, రచయితలను ప్రశ్నించడంపై ఆందోళన వ్యక్తంచేశాయి.

జర్నలిస్టుల ఎలక్ట్రానిక్ పరికరాలను అప్పటికప్పుడు సీజ్ చేయడం, న్యూస్‌క్లిక్ డైరెక్టర్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిని అరెస్టు చేయడం గురించి వివరించాయి. జర్నలిస్టుల ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల స్వాధీనం, పాత్రికేయులను ప్రశ్నించేందుకు అనుసరించే నిబంధనలు, మార్గదర్శకాలను రూపొందించడంలో న్యాయస్థానాల సహకారాన్ని లేఖ ద్వారా కోరాయి. చట్టానికి అతీతమన్నట్లు వ్యవహరించే సంస్థలు, వ్యక్తులను జవాబుదారీగా చేసేందుకు హామీ కల్పించాలని విజ్ఞప్తి చేశాయి. 'పత్రికా స్వేచ్ఛపై అధికారిక దాడులు పెరిగాయి. వీటిలో న్యాయపరమైన జోక్యం అవసరమైన ఘటనలు అనేకమున్నాయి. తాజా ఘటన క్రమంలో పోలీసుల దమనకాండ క్రమంలో న్యాయవ్యవస్థ జోక్యాన్ని కోరడం తప్ప ప్రత్యామ్నాయం లేదు. జర్నలిస్టులుగా, వార్తా సంస్థల ఉద్యోగులుగా కేసు విచారణకు పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాం. లాప్‌ట్యాప్‌లు, ఫోన్లను స్వాధీనం చేసుకోవడం, విచక్షణారహితంగా విచారణలు జరపడం వంటివి ప్రజాస్వామిక దేశంలో తగవు.ముఖ్యంగా ప్రజాస్వామ్యానికి తల్లిగా ప్రచారం చేస్తున్న సమయంలో ఇలాంటివి సరికాదు' అని పేర్కొన్నాయి. సీజేఐకి లేఖ రాసిన సంస్థల్లో డిజిపబ్ న్యూస్ ఇండియా ఫౌండేషన్, ఇండియన్ ఉమెన్స్ ప్రెస్ కార్ప్స్, ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా, ఫౌండేషన్ ఆఫ్ మీడియా ప్రొఫెషనల్స్, నెట్వర్క్ ఆఫ్ ఉమెన్ ఇన్ మీడియా-ఇండియా, చండీగఢ్ ప్రెస్‌క్లబ్, నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్, దిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, కేరళ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, బృహన్‌ముంబై యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, ఫ్రీ స్పీచ్ కలెక్టివ్-ముంబై, ముంబై ప్రెస్‌క్లబ్, అరుణాచల్ ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ప్రెస్ అసోసియేషన్, గువహటి ప్రెస్‌క్లబ్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ఉన్నాయి.

అందరికీ అవే ప్రశ్నలు

- దిల్లీ ఘర్షణలు, రైతుల ఆందోళన, సీఏఏ, కోవిడ్ మీదే ఆరా
- ప్రభుత్వ వ్యతిరేక కథనాలు ఎందుకు రాశారని అడిగారు
- విచారణ తీరుపై బాధిత జర్నలిస్టులు

మాట్లాడుతున్న పరంజయ్ గుహ ఠాకుర్తా

న్యూదిల్లీ: పత్రికా స్వేచ్ఛకు కళ్లెం వేసే విధంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తా ప్రసారాలు, కథనాల వెలువరించే సంస్థలపై ఉక్కుపాదం మోపేలా కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తోంది. తమ తప్పులు ఎత్తిచూపే వార్తలు రాసే సంస్థలు, పాత్రికేయులను బెదిరించేందుకు పోలీసులు, దర్యాప్తు సంస్థలను వినియోగిస్తోంది. కలానికి కళ్లెం వేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా న్యూస్‌క్లిక్‌పై చర్యలకు దిగింది. వార్తా సంస్థ ఎడిటర్‌తో పాటు హెచ్‌ఆర్ హెడ్ చక్రవర్తిపై ఉపా కేసు పెట్టి ఏడు రోజుల పోలీసు కస్టడీకి పంపారు. సుమారు 50 మంది జర్నలిస్టులను పోలీసులు విచారించారు. వారి ఇళ్లలో సోదాలు నిర్వహించి ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. అయితే విచారణలో అందరికీ దాదాపు ఒకే తరహా ప్రశ్నలు ఎదురయ్యాయి. వివాదాస్పద అంశాల్లో జరిగిన వార్తాసేకరణ, ప్రసారాల గురించి దర్యాప్తు అధికారులు ఆరా తీసినట్లు విచారణను ఎదుర్కొన్న జర్నలిస్టులు వెల్లడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు ఎందుకంటూ నిలదీశారని చెప్పారు. కోవిడ్, సీఏఏ- ఎన్‌ఆర్‌సీ, రైతాంగ పోరు, దిల్లీ ఘర్షణలప్పుడు ఎక్కువగా ప్రభుత్వ వైఫల్యాలపైనే వార్తాలు వచ్చాయి. మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటం ఏడాదికిపైగా సాగింది. 2020లో దిల్లీ అల్లర్లు జరిగాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. కోవిడ్-19 సంక్షోభం వేళ అనేక విషయాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు వచ్చాయి. సీఏఏ-ఎన్‌ఆర్‌సీ వ్యతిరేక ఆందోళనపైనే అటు తిప్పి ఇటు తిప్పి తమను ప్రశ్నించారని జర్నలిస్టులు చెప్పారు. న్యూస్‌క్లిక్‌తో సంబంధాలనూ ఆరా తీశారన్నారు. ఒక ప్రొఫార్మాతో ప్రశ్నించినట్లు విచారణ తీరు ఉందని కొందరన్నారు. తమ ఇళ్లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడంపైనా ఆవేదన వ్యక్తంచేశారు. పోలీసులు మర్యాద గానే ప్రశ్నించారని ఓ మహిళా జర్నలిస్టు చెప్పారు. మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక సెల్‌లో పోలీసులు విచారించారని సీనియర్ జర్నలిస్ట్ పరంజయ్ గుహ ఠాకుర్తా తెలిపారు. తన బావ అమెరికా నంబరు ఉందా? ఆయన సిగ్నల్ మెసేజింగ్ యాప్ వాడతారా? దిల్లీ అల్లర్లు, రైతుల ఆందోళనపై వార్తలు సేకరించారా? అని ప్రశ్నించినట్లు చెప్పారు. తనను మళ్లీ పిలిచే అవకాశం ఉందన్నారు. విచారణ సమయంలో చాలా మంది ఉన్నారని, వారంతా వేర్వేరు ప్రశ్నలు అడిగారని పరంజయ్ గుహ తెలిపారు. అసలు తనపై ఏయే ఆరోపణలు ఉన్నాయో కూడా తెలియదని, ఎఫ్‌ఐఆర్ ప్రతి ఇప్పటివరకు అందలేదని, ఫోన్, లాప్‌ట్యాప్‌ను స్వాధీనం చేసుకున్నారని మరొక సీనియర్ జర్నలిస్ట్ అన్నారు. సుమారు రెండు గంటల పాటు తన ఇంట్లో సోదాలు జరిగినట్లు చెప్పారు. న్యూస్‌క్లిక్ ఎడిటోరియల్ బృందంలో జూనియర్ జర్నలిస్ట్ మాట్లాడుతూ రైతుల ఆందోళన, దిల్లీ అల్లర్లపై కథనాలకు అదనంగా చెల్లించారా? దేశానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు ఎందుకు రాశారు? అని తనను అడిగినట్లు చెప్పారు. ఓ ఫర్మామా ప్రకారం ప్రశ్నలు ఉన్నట్లు తోచిందన్నారు. మరొక జర్నలిస్టు అభిసార్ శర్మ తన విచారణ గురించి మాట్లాడుతూ దిల్లీ అల్లర్లు, రైతుల ఆందోళనలు, షహీన్‌బాగ్‌లో సీఏఏ-ఎన్‌ఆర్‌సీ ఆందోళనలపై కథనాలు ఇచ్చారా? పోలండ్, బ్రిటన్, ఆస్ట్రేలియాలో ఎవరితోనైనా మాట్లాడారా? అని ప్రశ్నించినట్లు వెల్లడించారు.

రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్



స్టాక్‌హోం: రసాయశాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ పురస్కారం దక్కింది. మోంగి బావెండి, లూయిస్ బ్రస్, అలెక్సీ ఎకిమోవ్‌లను ఈ ఏడాది నోబెల్ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కమిటీ బుధవారం ప్రకటించింది. క్వాంటమ్ డాట్స్ విశ్లేషణ, ఆవిష్క రణలో, నానో పార్టికల్స్ అభివృద్ధిలోనూ ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు కీలకపాత్ర పోషించినట్లు నోబెల్ కమిటీ తెలిపింది. క్వాంటమ్ డాట్స్, నానో పార్టికల్స్‌కు విశిష్టమైన గుణాలు ఉన్నాయి. ఎల్‌ఈడీ టెలివిజన్ స్క్రీన్‌లు, సోలార్ ప్యానెల్‌లు, వైద్య చికిత్సలో క్వాంటం డాట్‌లను అధికంగా వినియోగిస్తుంటారు. శస్త్రచికిత్సలో కణితులు తొలగించడంలో వైద్యులకు సహాయపడతుం టాయి. భవిష్యత్తులో జరగబోయే క్వాంటమ్ కమ్యూనికేషన్ కోసం క్వాంటమ్ డాట్స్ కీలకం కానున్నట్లు నోబెల్ కమిటీ తెలిపింది. అయితే రసాయన శాస్త్రంలో బహుమతి గ్రహీతల పేర్లు ప్రకటనకు ముందే లీక్ అయినట్లు కొన్ని గంటల ముందు స్వీడన్ మీడియా సంస్థలు ప్రకటించాయి. ఇలాంటి ఘటనలు అరుదుగా జరుగుతుంటాయని, నోబెల్ కమిటీ ప్రకటించేంతవరకు విజేతల పేర్లు బయటకు రాకుండా చూసేందుకు తీవ్రంగా యత్నిస్తుంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

జుబేర్‌కు భావప్రకటన స్వేచ్ఛ అవార్డు

న్యూదిల్లీ: భావ ప్రకటన స్వేచ్ఛ పురస్కారం-2023 కోసం ఆల్ట్ న్యూస్ సహ-వ్యవస్థాపకులు మహమ్మద్ జుబేర్ ఎంపికయ్యారు. సాహసోపేతంగా, అధిక ప్రభావం చూపే, కచ్చితమైన జర్నలి జానికిగాను ఈ అవార్డును అంద జేస్తారు. ఈ పురస్కారానికి ఎంపికైన ముగ్గురిలో జుబేర్ ఒకరుగా ఉన్నారు. సోమాలియాలో తొలి మహిళల మీడియా సంస్థ, న్యూస్‌రూమ్ 'బిలన్ మీడియా'తో పాటు జనవరిలో తాలిబన్లు బంధించిన అఫ్గాన్ జర్నలిస్టు ముర్తజా బెహ్‌బౌది కూడా ఎంపికయ్యారు. సెన్సార్‌షిప్, భారతీయ మీడియాలో లోటుపాట్లు, మీడియా సంస్థలపై రాజకీయ ఒత్తిడి, అపారదర్శక విధానాలకుగాను వార్తా సంస్థలకు ప్రభుత్వ నిధులు సమకూర్చడం వంటి అంశాలు బయట పెట్టినందుకు వీరిని 'ఇండెక్స్' ఎంపిక చేసింది. ప్రచార నెట్వర్క్‌ల నిర్వీర్యం, రాజకీయ నిజనిర్ధారణ, సామాజిక మాధ్యమాల్లో వదంతులు, తప్పుడు కథనాల పరిశీలనకు ఆల్ట్ న్యూస్ పేరుగాంచిన విషయం తెలిసిందే.

10న ప్రివిలేజ్ కమిటీ ముందుకు బిధూఢీ

న్యూదిల్లీ: లోక్‌సభ ప్రివిలేజెస్ కమిటీ అక్టోబరు 10న బీఎస్‌పీకి చెందిన డానిష్ అలీపై బీజేపీ సభ్యుడు రమేశ్ బిధూఢీ అభ్యంతరకర వ్యాఖ్యలపై సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ సమయంలో అధికార పార్టీ ఎంపీ ప్యానెల్‌కు మౌఖిక సాక్ష్యం ఇస్తారు. 'చంద్రయాన్-3 మిషన్' పై సభలో జరిగిన చర్చలో అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలపై ఎంపీ రమేశ్ బిధూఢీపై, అలాగే డానిష్ అలీపై వివిధ పార్లమెంటు సభ్యుల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి బిధూడీ ప్రివిలేజ్ కమిటీ ముందు హాజరై సాక్ష్యమివ్వనున్నట్లు సమావేశ అజెండా పేర్కొంది. బిధూఢీపై చర్య తీసుకోవాలని కోరుతూ లోక్‌సభలోని అనేక మంది ప్రతిపక్ష నాయకులు స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయడంతో ఈ అంశం రాజకీయ పార్టీల్లో అలజడి రేపింది.

అయితే దక్షిణ దిల్లీ ఎంపీ బిధూఢీ మాట్లాడుతున్నప్పుడు డానిష్ అలీ తన 'రన్నింగ్ కామెంట్రీ' లో ప్రధాని నరేంద్ర మోదీపై అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని అనేక మంది బీజేపీ సభ్యులు ఆరోపించారు. ఎంపీల నుంచి అందిన ఫిర్యాదులన్నింటినీ స్పీకర్ బీజేపీ సభ్యుడు సునీల్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ప్రివిలేజెస్ కమిటీకి పంపారు.

విశాఖ ఉక్కును సందర్శించిన ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రతినిధులు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం(విశాఖ): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం జాతీయస్థాయిలో పేరు గాంచడం శుభపరిణామమన్నారు. సముద్ర తీర ప్రాంతంలో ఉన్న ఏకైక ఉక్కు కర్మాగారం ఇదేనని, విశాఖ ఉక్కు ప్రగతిపథంలో దూసుకుపోవడం అద్భుతమన్నారు. అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటైన ఈ ఉక్కు కర్మాగారానికి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. భావితరాలకు ఇలాంటి కర్మాగారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఉక్కు కర్మాగారాన్ని 26 జిల్లాలకు చెందిన 40 మంది ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు సందర్శించారని చెప్పారు. ప్రతినిధి బృందానికి సహకరించిన ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, విశాఖ జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు క్షేత్రపాల్, ఉక్కు ఏఐటీయూసీ నాయకులు కె.రాజబాబు, తాండ్ర కనకరాజు, జి.ఆనంద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు, విశాఖ జిల్లా నాయకులు రాంబాబు, డి.దేముడుకు ధన్యావాదాలు తెలిపారు.

నేటి నుంచే వన్డే ప్రపంచకప్

- తొలి మ్యాచ్ ఇంగ్లండ్Xన్యూజిలాండ్
- మధ్యాహ్నం 2.00 గం.లకు
- స్టార్ స్పోర్ట్స్, డిస్నీ హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

న్యూదిల్లీ: ప్రపంచ క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న వన్డే ప్రపంచకప్-2023 అక్టోబర్ 5, గురువారం ప్రారంభం కానుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్ గత ప్రపంచకప్ రన్నరప్ న్యూజిలాండ్‌తో తలపడనుంది. ఇంగ్లండ్ తన టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు పోరాటం చేయనున్నది. గాయాలతో సతమతం అవుతున్న న్యూజిలాండ్ కూడా ఈ మ్యాచ్‌లో గెలవాలన్న పట్టుదలతో ఉంది. 2019లో జరిగిన వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఈ రెండు జట్లే తలపడిన విషయం తెలిసిందే. న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్‌సన్, బౌలర్ టిమ్ సౌథీలు జట్టుకు దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ ఇద్దరూ ప్రస్తుతం గాయాలతో ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు ఇంగ్లండ్ జట్టు మాత్రం మేటి బ్యాటర్లతో బలంగా కనిపిస్తోంది. బెన్ స్టోక్స్‌తో పాటు జోస్ బట్లర్, జానీ బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్, జో రూట్, డేవిడ్ మలాన్, హ్యారీ బ్రూక్ లాంటి హిట్టర్లు ఆ జట్టులో ఉన్నారు. ఐపీఎల్‌లో ఆడిన అనుభవం ఉన్న ఇంగ్లండ్ ఆటగాళ్లకు ఇండియా పిచ్‌లు మరింత అనుకూలించే అవకాశాలు ఉన్నాయి. మొయిన్ అలీ, క్రిస్ వోక్స్, సామ్ కర్రన్ లాంటి ఆల్‌రౌండర్లు కూడా ఆ జట్టుకు బలాన్ని ఇవ్వనున్నారు.

వన్డే ప్రపంచకప్‌లో ఇది 13వ ఎడిషన్

ఐసీసీ ప్రతి నాలుగేళ్లకు ఓసారి వన్డే ఫార్మాట్ లో నిర్వహించే మెగా టోర్నీ ఇది. ఈసారి ఇండియా ఆతిథ్యమిస్తోంది. ఇది నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరగాల్సి ఉన్నప్పటికీ కోవిడ్ కారణంగా ఏడాది చివరికి వాయిదా వేశారు. దీంతో అక్టోబర్, నవంబర్ నెలల్లో జరుగుతోంది. 2019 డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తో సహా 10 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. 1987, 1996, 2011లలో భారత ఉపఖండంలోని ఇతర దేశాలతో కలిసి టోర్నమెంట్‌కు సహ-ఆతిథ్యం ఇచ్చిన ఇండియా పూర్తిగా సొంతంగా టోర్నమెంట్‌ను నిర్వహిం చడం ఇదే మొదటిసారి. నవంబర్ 19, 2023న అహ్మదా బాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఫైనల్ జరగనుంది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో, కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో సెమీ ఫైనల్స్ జరుగుతాయి. 2011లో చివరిసారి ఇండియాలో జరిగిన వరల్డ్ కప్‌ను ఇండియా గెలవగా.. మరోసారి స్వదేశంలో జరగబోతున్న ఈ టోర్నీ గెలవాలని ఫ్యాన్స్ ఆరాటపడుతున్నారు. ఈ మెగా టోర్నీ షెడ్యూల్ ను జూన్ 27న ఐసీసీ రిలీజ్ చేసింది. ఈ టోర్నీలో మెగా మ్యాచ్ ఇండియా, పాకిస్థాన్ మధ్య అక్టోబర్ 15న మ్యాచ్ జరుగుతుందని మొదట ప్రకటించినా.. తర్వాత దీనిని అక్టోబర్ 14నే నిర్వహించనున్నారు. అక్టోబర్ 15న నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ఈ నిర్ణ యం తీసుకున్నారు. గత ప్రపంచకప్ మాదిరిగానే ఈ టోర్నీలో 10 జట్లు పాల్గొంటాయి. వన్డే క్రికెట్ ప్రపంచ కప్ సూపర్ లీగ్ ద్వారా వరల్డ్ కప్ కు జట్లు అర్హత సాధిస్తాయి. ఇందులో నుంచి 8 టీమ్స్ నేరుగా క్వాలిఫై అవుతాయి. సూపర్ లీగ్‌లోని మొత్తం 13 జట్లలో టాప్ 8కు ఈ అర్హత ఉంటుంది. ఆతిథ్య ఇండియా ఆరో స్థానంలో నిలిచింది వరల్డ్ కప్ లో అడుగుపెడుతోంది. నిజానికి ఆతిథ్య దేశం కావడంతో ఇండియా ఆటోమేటిగ్గా అర్హత సాధిస్తుంది. 8 జట్లు నేరుగా క్వాలిఫై అవడంతో మిగిలిన రెండు స్థానాల కోసం క్రికెట్ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ నిర్వహించారు. నెదర్లాండ్స్, శ్రీలంక టీమ్స్ దీని ద్వారా అర్హత సాధించాయి. రెండుసార్లు ఛాంపియన్ అయిన వెస్టిండీస్ క్వాలిఫయర్స్ లో ఓటమి పాలైంది. దీంతో ఆ జట్టు లేకుండా జరుగుతున్న తొలి ప్రపంచకప్ కూడా ఇదే. ఐసీసీలో పూర్తిస్థాయి సభ్యత్వం ఉన్న జింబాబ్వే, ఐర్లాండ్ కూడా అర్హత సాధించలేకపోయాయి. క్వాలిఫయర్స్‌లో పాల్గొన్న నాలుగు పూర్తిస్థాయి సభ్యులలో మూడు అర్హత సాధించలేదు. శ్రీలంక మాత్రమే వరల్డ్ కప్ లో అడుగుపెట్టింది. స్కాట్లాండ్ పై గెలిచిన నెదర్లాండ్స్ వరల్డ్ కప్ కు అర్హత సాధించింది. ఇక ఈ వరల్డ్ కప్ మొత్తం 10 వేదికల్లో జరగనుంది. అందులో హైదరాబాద్ కూడా ఒకటి. దీంతో ఈ పది వేదికల్లో స్టేడియాల అభివృద్ధి కోసం బీసీసీఐ భారీగా నిధులు వెచ్చించింది. ఈ పది వేదికల్లో ఇండియన్ టీమ్ 9 వేదికల్లో ఆడనుంది. ఒక్క హైదరాబాద్ లో మాత్రమే ఇండియా మ్యాచ్ ఏదీ లేదు. ఇక హైదరాబాద్‌లో మూడు లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.